ప్రజాశక్తి
మంగళవారం 19 ఆగస్టు 2025
8 పేజీలు





ఎన్‌టిఆర్
కృష్ణా

# ప్రజారోగ్యం గాలికి...

- విష జ్వరాలు విజృంభణ
- బందరు, గూడూరు మండలాల్లో డెంగ్యూ కేసులు
- పలు ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌ల్లో పరీక్షలు
- చికిత్సల పేరుతో భారీగా వసూళ్లు
- పెరుగుతున్న పాము, కుక్క కాట్లు



**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

విష జ్వరాలు, అతిసార పెరిగిపోతున్నాయి. మరోపక్క సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ కేసులు నమోదుకావడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు దీన్ని వ్యాపారంగా మార్చుకుని పరీక్షలు, చికిత్సల పేరుతో వ్యాధి పీడితుల నుంచి భారీగా నగదు గుంజుతున్నాయి. మరోపక్క పాము, కుక్క కాట్లు పెరిగిపోయాయి.

కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని సర్వజనీన ఆసుపత్రి ల్యాబ్‌లో మాత్రమే ఎలీసా రక్త నమోనా పరీక్షను నిర్వహించి డెంగీ వ్యాధిని నిర్ధారించాలి. ఈనెల 17వ తేదీ వరకు ఇక్కడ నిర్వహించిన పరీక్షల్లో బందరు, గూడూరు మండలాల్లోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఇరువురు డెంగ్యూ బారిన పడినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. జ్వరాలతో బాధపడుతూ పలు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లిన వారికి అనధికారికంగా ఎలీసా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రయివేటు ఆసుపత్రులు, వైద్యులు సిఫార్సు చేసిన ల్యాబ్‌లలో ఒక్కొక్కరి నుంచి రూ.1500 నుంచి రూ.2000 వరకు వసూలు చేస్తున్నారు. ప్లేట్‌లెట్లు తగ్గాయని, డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని చెబుతూ ఇన్‌పెషెంట్లుగా ఆసుపత్రుల్లో ఉంచుకుని చికిత్స అందిస్తూ భారీగా దండుకుంటున్నాయి. మరోపక్క సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. గత 17 రోజుల్లో 1214 మంది విషజ్వరాలు, 63 మంది అతిసార (డయేరియా) బారిన పడి వివిధ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందారు. దీనికి అనేక రెట్ల మంది జ్వరాలతో ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. ఇప్పటికీ ఆసుపత్రులు కిక్కిరిసి పోతున్నాయి. మరోపక్క టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి.

**వెంటాడుతున్న పాములు, కుక్కలు**

జిల్లాలో పాము, కుక్క కాట్లు బెడద ఎక్కువయింది. వ్యవసాయ సీజన్‌లో ప్రతి ఏటా పాము కాట్లు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ ఏడాది జూన్, జులైల్లో భారీ సంఖ్యలో పాము కాట్ల బారిన పడి పలువురు ఆసుపత్రుల పాలయ్యారు. సీజన్‌తో సంబంధం లేకుండా వీధి కుక్కల కాటుకు గురవుతున్నారు. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఆగస్టు 17 వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారి వివరాలిలా ఉన్నాయి.

| నెల | విష జ్వరాలు | అతిసార | పాముకాట్లు | కుక్కకాట్లు |
|---|---|---|---|---|
| జనవరి | 1,479 | 61 | 41 | 1,174 |
| ఫిబ్రవరి | 1,411 | 51 | 29 | 1,035 |
| మార్చి | 1,457 | 70 | 23 | 1,017 |
| ఏప్రిల్ | 1,321 | 67 | 30 | 1,020 |
| మే | 1,625 | 95 | 30 | 0,911 |
| జూన్ | 1,317 | 103 | 49 | 0,801 |
| జూలై | 1,677 | 102 | 106 | 0,932 |
| ఆగస్టు | 1,314 | 063 | 60 | 0,316 |
| మొత్తం | 11,501 | 612 | 368 | 7,206 |

## కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**డాక్టర్ ఎస్.శర్మిష్ట, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి, కృష్ణా**

వర్షం నీరు, మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఈగలు, దోమలు పెరుగుతున్నాయి. తాగునీరు కలుషితం అవుతోంది. దీంతో ప్రజలు అతిసార, టైఫాయిడ్, విష జ్వరాలు, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. అవసరమైన ప్రాంతాల్లో క్లోరిన్ బిళ్లలను అందిస్తున్నాం. వ్యాధుల నియంత్రణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి. కాచి చల్లార్చిన నీరు తాగాలి. వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వస్తాం. వ్యాధుల నియంత్రణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం.

# పింఛను లబ్ధిదారుల్లో కోత

- కృష్ణాజిల్లాలో 3,987 మందికి నోటీసులు
- ఆందోళనలో వికలాంగ లబ్ధిదారులు

**ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి**

"అర్హత కలిగిన స్థాయిలో మీకు వైకల్యం, అనారోగ్యం లేదు. అందువల్ల మీ పింఛన్‌ను ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వండి' అని జిల్లాలోని వేలాది మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులపై అభ్యంతరం ఉంటే సదరు లబ్ధిదారులు తిరిగి అప్పీల్ చేసుకోవాలని అధికార యంత్రాంగం చెబుతోంది. దీంతో తమకు పూర్తి స్థాయిలో పింఛన్ నిలిచిపోతుందని నోటీసులు అందుకున్న లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే పెంచిన పింఛన్ అందుతోందనే మురిపెం మూడునాళ్ల ముచ్చటగా మారిపోయిందని పింఛన్లు కోల్పోయిన లబ్ధిదారులు ఆందోళనకు చెందుతున్నారు.

**3,987 మందికి నోటీసులు**

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ (డిఎంహెచ్‌వో) సిఫార్సు చేసిన 1,097 మంది లబ్ధిదారులు ఒక్కొక్కరికి పింఛన్‌ను ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.15 వేలకు పెంచింది. అలాగే మరో 33 వేల మంది వికలాంగుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు కూటమి ప్రభుత్వం పెంచింది. అయితే ఈ పింఛన్ లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు చోటు చేసుకున్నాయని చెబుతూ ప్రత్యేక బృందాలతో 2025 జనవరి నుంచి జూలై వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపింది. మొత్తం 34,097 మంది లబ్ధిదారుల్లో 3,987 మందికి అర్హతలను నిరూపించుకోవాల్సిందిగా ప్రభుత్వం నోటీసులు పంపింది.

**రూ.15 వేలు తొలగింపు... రూ.4 వేలకు సిఫార్సు**

డిఎంహెచ్‌వో సిఫార్సు చేసిన 1,097 మందికి ప్రతినెలా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున కోటీ 64 లక్షల 55 వేల రూపాయలను ప్రభుత్వం అందిస్తోంది. మంచానికే పరిమితమైన లబ్ధిదారులకే ఈ పింఛన్ అందిస్తామని చెబుతూ లబ్ధిదారుల సంఖ్యలో సగానికిపైగా ప్రభుత్వం కోత పెట్టినట్లు తెలుస్తోంది. పింఛన్ కోల్పోయిన లబ్ధిదారుల్లో వ్యతిరేకత లేకుండా వారిలో వృద్ధాప్య పింఛన్‌కు అర్హతలను అధికారులు గుర్తిస్తున్నారు. ఇప్పటికే నోటీసులు అందుకున్నవారిలో 481 మంది వృద్ధాప్య పింఛన్‌కు అర్హులని గుర్తించారు. అనారోగ్యంతో బాధపడుతూ నెలకు రూ.15 వేలు అందుకున్న ఈ లబ్ధిదారులందరికీ ఇక నుండి రూ.4 వేలు పింఛను మాత్రమే అందనుంది. ప్రభుత్వం భారం తగ్గించుకునేందుకే తమ పింఛన్లలో కోత పెట్టిందని నోటీసులు అందుకున్న లబ్ధిదారులు చెబుతున్నారు.



వికలాంగుడికి పింఛను అందిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణ, కలెక్టర్ డికె.బాలాజీ (ఫైల్ ఫొటో)

# రాజధాని పనులకు ఆటంకం

- అమరావతిని వెంటాడుతున్న ముంపు
- వాగుల నియంత్రణపై కొరవడిన దూరదృష్టి
- పదేళ్లుగా దక్కని పరిష్కారం

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

వర్షాలతో రాజధానిలో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వారం రోజులుగా వర్షాల వల్ల పనులు ముందుకు సాగడం లేదు. ప్రధానంగా వాగుల వల్ల గ్రామాల్లో ముంపు సమస్య వెంటాడుతోంది. చిన్న పాటి వర్షాలతో కొన్ని వాగులు, భారీ వర్షాల వల్ల మరికొన్ని వాగులు పొంగి ప్రవహించి రాజధాని ప్రాంతాన్ని ముంచెత్తుతున్నాయి. దీని వల్ల రాజధానిలో అభివృద్ధి పనులు వేగం పుంజుకోవడం లేదు. లాం దగ్గర నుండి వచ్చే కొండవీటివాగు, మోతడక, నిడుముక్కల నుంచి కొట్టేళ్ల వాగు, వైకుంఠపురం వద్ద పాలవాగు, మందడంలో నుండి సారవాగు రాజధాని గ్రామాలను ముంపునకు గురిచేస్తున్నాయి. 2014లో రాజధానిగా అమరావతి ప్రకటించినప్పటి నుంచి భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి, కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు అనివార్యంగా రాజధాని గ్రామాలకు ముంపు బెడదతప్పడం లేదు. రాజధాని గ్రామాల్లో ముంపు సమస్యను ఇటీవల ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం కూడా సిఆర్‌డిఎ అధికారులను నిలదీసింది. శాశ్వత



నీరుకొండ వద్ద కొండవీటి వాగు ఉధృతి

పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించింది. రాజధానికి అతి పెద్ద వాగుగా ఉన్న కొండవీటి వాగు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనలేకపోయారు. 2018లో రూ.224.44 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. అయినా కొండవీటి వాగు నీటిని నియంత్రించలేకపోతున్నారు. పెదపరిమి వద్ద కోటేళ్ల వాగుతో ప్రతిసారీ రాకపోకలకు అంతరాయం కలుగుతున్నా నివారణ చర్యలు లేవు. మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లోని కొండల


(మిగతా 2లో)

# అంబేద్కర్ స్మృతి వనం నిర్వహణపై నిర్లక్ష్యం

- కార్మికులకు వేతనాలు చెల్లింపు నిల్
- పెండింగ్ రూ.27.20 లక్షలు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో కార్మికులు



**ప్రజాశక్తి - విజయవాడ :** ఇచ్చే అతి తక్కువ వేతనం అయినప్పటికీ...ఒకటి కాదు...రెండు కాదు...ఏకంగా ఎనిమిది మాసాల నుంచి సదరు కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకపోవడంతో నగరంలోని ఎంజి రోడ్డులో గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనంలో పనిచేస్తున్న కార్మికుల కుటుంబాల పరిస్థితి కడుదయనీయంగా ఉంది. వేతనాలు ఇవ్వాలని ఆర్‌కె కాంట్రాక్ట్ సంస్థకు చెందిన రవి కిరణ్ అనే కాంట్రాక్టర్, సంబంధిత అధికారులను పలు రూపాల్లో అడుగుతూ వస్తున్నా పట్టించుకోనందున చేసేది లేక విసిగి వేశారిన కార్మికులు ఈనెల 15న స్మృతివనం ప్రధాన గేట్లను మూసివేసి, అక్కడే బైటాయించి, గంటల తరబడి ధర్నా చేశారు. దీనికి సిఐటియు సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి



ఎం.బాబూరావు మద్దతు తెలిపి, కార్మికుల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని, లేనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎంతో ప్రతిష్టాత్మక, చారిత్రక కట్టడంగా నిర్మితమైన డాక్టర్ బిఆర్

(మిగతా 2లో)



రచయిత బోణం గణేష్‌ను సత్కరిస్తున్న మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్, సాహితీ వేత్తలు

## 'వర్ణం' సకల కవితల శోభితం : గజల్ శ్రీనివాస్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో :** సామాజిక, రాజకీయ, సాహిత్య, స్వ అనుభవాల సకల అంశాల సమ్మేళనం 'వర్ణం' కవితా సంపుటి అని మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ కొనియాడారు. విజయవాడలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాలులో 'విశ్వ సాహితీ కళావేదిక' ప్రారంభోత్సవం, జాతీయ శతాధిక కవి సమ్మేళనం జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గజల్ శ్రీనివాస్ సీనియర్ జర్నలిస్ట్ బోణం గణేష్ రచించిన 'వర్ణం' కవితా సంపుటిని అవిష్కరించారు. అనంతరం వర్ణం పుస్తక రచయిత బోణం గణేష్‌ను గజల్ శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వ సాహితీ కళావేదిక అధ్యక్షురాలు కొల్లి రమావతి, గ్రంథ పరిశోధకులు పూర్ణచందు, కామ్రేడ్ జిఆర్‌కె పోలవరపు సాహితీ సమితి వ్యవస్థాపకులు గోళ్ల నారాయణ, గొర్రెల లక్ష్మీనారాయాణ ఫౌండేషన్ అధ్యక్షుడు గొర్రెల శ్రీధర్, కైండ్ నెస్ సొసైటీ నిర్యాహకుడు గట్టెం మాణిక్యాలరావు పాల్గొన్నారు.

## 9 ఫిర్యాదుల స్వీకరణ

**ప్రజాశక్తి - విజయవాడ :** నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం ఈ కార్యక్రమంలో పాల్గొని 9 ఫిర్యాదులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానెర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జున రావు, పర్యవేక్షణ ఇంజనీర్లు పి. సత్యకుమారి, పి. సత్యనారాయణ, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, బయాలజిస్ట్ కామేశ్వర రావు పాల్గొన్నారు.



# పునరావాస కేంద్రాల జాబితా ప్రదర్శించాలి

### విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** ప్రతి సచివాలయంలో దగ్గరలోని పునరావాస కేంద్రాల జాబితాను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌యం అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన గాంధీజీ మహిళా కళాశాల, మోటూరు హనుమంతరావు ప్రభుత్వ పాఠశాల, శ్రీ వెలగపూడి లక్ష్మణ దత్తు నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల, మామిడికాయ పాకల వద్ద గల వంగవీటి మోహనరంగా కళ్యాణమండపం, రామలింగేశ్వర నగర్‌లో గల విఎంసి ప్రైమరీ హైస్కూల్ లోగల పునరావాస కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పునరావాస కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండాలని, ప్రతి పునరావాస కేంద్రానికి రేటింగ్ ఇవ్వాలని, ఆ కేంద్రాల్లో



లేని వసతులను గమనించి రేటింగ్‌ని అక్కడున్న సిబ్బంది తగ్గించి, దేనిలో లోపాలు ఉన్నాయో ఆ లోపాలు సరిచూసుకోవాలని శాఖాధిపతులను ఆదేశించారు. పునరావాస కేంద్రం అక్కడ ఉండేటట్టు తెలిపే సూచన బోర్డు, పారిశుధ్య నిర్వహణ, త్రాగునీరు, హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్, మరుగుదొడ్లు, వాటిని సూచించే బోర్డులు, ప్రధానంసాలుగా ఉంచుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసేటట్టు ఈ రేటింగ్ పనికొస్తుందని అధికారులు అన్నారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లు జె. శ్రీనివాస్, జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాలకష్ణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాలను తొలగించండి : ధ్యానచంద్ర

**ప్రజాశక్తి - విజయవాడ, అర్బన్ :** వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. సోమవారం ఆయన ఫార్చ్యూన్ మురళి పార్క్‌రోడ్, మదర్ తెరిసా జంక్షన్, పినమనేని పాలీ క్లినిక్ రోడ్, టిక్కెల్ రోడ్, జమ్మిచెట్టు సెంటర్, సాంబమూర్తి రోడ్ మ్యూజియం రోడ్డు ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షపు నీటి నిల్వలు ఎక్కడా లేకుండా మొన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా వ్యర్థాలు ఉంటే పారిశుధ్యం సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. చెత్త ఇంటింటి సేకరణ ఖచ్చితంగా జరగాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు




ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి ధర్నా చౌక్‌లో గల అన్న క్యాంటీన్ ను పరిశీలించారు. తాగునీటి, వాడుక నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం రాకూడదని, పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా జరగాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్–3 కె.షమ్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

## వారికి జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం గృహాలు ఇవ్వండి : విఎంసి కమిషనర్

**ప్రజాశక్తి - విజయవాడ సిటీ :** కొండ ప్రాంతాలలో ప్రమాదానికి గురయ్యే ఇళ్లలో నివసిస్తున్న వారికి వెంటనే జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ ఇళ్లను కేటాయించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అధికారులను ఆదేశించారు. సోమవారం చిట్టినగర్ ప్రాంతంలో పర్యటించి కొండ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజల ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదానికి గురయ్యే ఒక ఇంటిని పరిశీలించి అక్కడ నివసిస్తున్న తేజ, నాగమణితో మాట్లాడారు. తమకు ఇళ్లు కేటాయిస్తే వెంటనే అక్కడికి వెళ్తామని అంగీకారం తెలపడంతో, టౌన్ ప్లానింగ్, జెడి అవంత్ సమన్వయంతో వెంటనే ఇంటిని కేటాయించాలని ఆదేశించారు.



## మొదటిపేజీ తరువాయి

### రాజధాని పనులకు ఆటంకం

నుంచి వచ్చే కొండవీటి వాగు ముంపుపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వలేదు. మోతడక, అనంతవరం, నెక్కల్లు పరిసరాల్లో నుండి తుళ్లూరు, పెదపరిమి మధ్యలో నుండి నీరుకొండ, శాఖమూరు గ్రామాలను కొటేళ్లవాగు ముంచెత్తుతోంది. వైకుంఠపురం నుండి దొండపాడు, రాయపూడి, మందడం, వెంకటపాలెం మీదుగా పాలవాగు వస్తోంది. వెలగపూడి, మందడం, వెంకటపాలెం గ్రామాలను సారవాగు ముంచెత్తుతోంది. ఈ వాగులు సహజంగా వచ్చే నీటితో పరిసరాల్లో కురిసే అతి భారీ వర్షాలతో కలిసే ఐదారు వేల క్యూసెక్కుల నీరు ఒకేసారి రావడం వల్ల ముంపు సమస్య వెంటాడుతోంది. ఇప్పటి వరకు వీటి నియంత్రణపై శాశ్వత పరిష్కారం కొనుగొనలేకపోతున్నారు. ముంపుపై జిల్లాకు చెందిన జలవనరుల శాఖ, సిఆర్‌డిఎ అధికారుల కంటే ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు కూడా అధ్యయనం చేసి అధికారులతో ఇటీవల చర్చించారు. ముంపు నివారణలో గత పదేళ్లలో వచ్చిన విమర్శలు, ప్రభుత్వ వైఫల్యంను ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు గుర్తించారు. వాగులు అన్ని రాజధాని గ్రామాలకు బయట ప్రాంతాల్లోనే ప్రారంభం అవుతాయి. కానీ అన్ని వాగులను రాజధాని గ్రామాల మీదుగా ఇతర ప్రాంతాలకు మళ్లించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మరో వాగుల ద్వారా వచ్చే నీటిని బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని రైతులు మొత్తుకున్నా సిఆర్‌డిఎ అధికారులు పట్టించుకోలేదు. అతి భారీ వర్షాలు, తుపాన్లు, కృష్ణానదికి వరద వచ్చిన ప్రతిసారి రాజధాని గ్రామాలకు ముంపు బెడద తప్పడం లేదు. ఈ నేపథ్యంలో వాగులు రాజధాని గ్రామాలలోకి రాకుండా బయట ప్రాంతంలోనే నియంత్రించి ప్రత్యామ్నాయ చర్యలు చేపడితే సత్ఫలితాలు వస్తాయనే సూచనలొస్తున్నాయి.

### అంబేద్కర్ స్మృతి వనం నిర్వహణపై నిర్లక్ష్యం

అంబేద్కర్ స్మృతివనంలో పనిచేస్తున్న స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులకు జవవరి నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో బాధిత కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేగాక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతి వనం నిర్వహణ ప్రశ్నార్ధకంగా మారిందని చెప్పక తప్పదు. కనీసంగా ఊడ్చే కార్మికులకు, కాపలాగా ఉండే వారికి కూడా వేతనాలు ఇవ్వడంలేదు. దీంతో స్మృతి వనం అభివృద్ధిపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదోనని నగరవాసులతో పాటు కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. స్మృతివనం నిర్వహణకు, కార్మికుల వేతనాలకు సంబంధించి ప్రత్యేక బడ్జెట్ లేదని ఉన్నత స్థాయి అధికారులు చెబుతున్నారు. స్మృతి వనాన్ని చూసేందుకు వచ్చే వారు, వివిధ రకాల వాహనాల పార్కింగ్ ఫీజుల రూపంలో వసూలు చేసే డబ్బే అన్నింటికీ దిక్కయినట్లు సమాచారం. స్మృతివనంలో క్లీన్ అండ్ గ్రీన్ వర్క్ చేసే 22 మంది కార్మికులతోపాటు మరో 12 మంది సెక్యూరిటీ గార్డులకు ఒక్కొక్కరికి నెలకు రూ.10 వేల చొప్పున అందరికీ కలిపి నెలకు రూ.3.40 లక్షలు, ఎనిమిది నెలలకు రూ.27.20 లక్షలు వేతనాల రూపంలో మంజూరు చేయాల్సి ఉందని కార్మికులు వివరిస్తున్నారు. ఇక్కడ పని చేసే వారంతా వెనుకబడిన సామాజిక తరగతులకు చెందిన అత్యంత నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. గుడివాడ, కొండపల్లి, సింగ్‌నగర్‌లోని ప్రకాష్‌నగర్, పాయకాపురం తదితర ప్రాంతాల నుంచి రోజుకు రూ.50 నుంచి రూ.100 వరకు సొంతగా ఛార్జీలు పెట్టుకొని వస్తున్న కార్మికులు ఇక్కడ పని చేయాల్సి వస్తోంది. విఎంసిలో కానీ, ప్రభుత్వ వైద్యశాలలో కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఇస్తున్నారు. ఆప్కాస్ కార్మికులకయితే రూ.21 వేలు కనీస వేతనం విఎంసి ఇస్తుంది. కానీ అంబేద్కర్ స్మృతివనం ప్రారంభమైన 2024 జనవరి నుంచి పనిచేస్తున్న కార్మికులే కాకుండా, అంతకముందు నుంచి కూడా కార్మికులు పని చేస్తున్నా కేవలం రూ.10 వేల కన్నా ఎక్కువ ఇవ్వకపోగా, ప్రతి నెలా వేతనం ఇస్తున్న పరిస్థితి లేకుండా పోయింది. దీంతో కార్మికులు క్రమంగా తగ్గిపోతున్నారు. 38 మంది నుంచి 22 మందికి కార్మికులు తగ్గారు. వీరికి కూడా వేతనాలు సక్రమంగా చెల్లించకపోగా, ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు కూడా సదరు కాంట్రాక్టర్ కల్పించడం లేదు. దీర్ఘకాలంపాటు పని దొరకుతుందని, మంచి వేతనాలుంటాయని సదరు కాంట్రాక్టర్ నమ్మపలుకుతూ వారితో నెలల తరబడి పనులు చేయిస్తూ వేతనాలు మాత్రం ఇవ్వడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక స్మృతివనంలో ఉన్న ఒక సూపర్‌వైజర్ మహిళా కార్మికుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, నోటికొచ్చినట్లు దురుసుగా మాట్లాడుతున్నాడని, అతని వేధింపులు తట్టుకోలేక పక్కనే ఉన్న పోలీస్‌స్టేషన్లో ఆయనపై కార్మికులు ఫిర్యాదు కూడా ఇచ్చినట్లు తెలిసింది. కలెక్టర్ పర్యవేక్షణలో, సాంఘిక సంక్షేమశాఖ నుంచి గత జులై ముందు వరకు కార్మికులకు వేతనాలు ఇస్తుండేవారని, కానీ ప్రస్తుతం ఈ స్మృతివనం నిర్వహణ మొత్తాన్ని రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి ఆధీనంలోకి మార్చివేస్తూ ప్రభుత్వం జులైలో జీఓ కూడా విడుదల చేసింది. ప్రస్తుతం ఈశాఖ సెక్రటరీగా ఉన్న ఆర్ మల్లిఖార్జునరావు, సదరు కాంట్రాక్టర్ కార్మికుల పెండింగ్ వేతనాల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఈనెల 15న కార్మికులు ధర్నా చేసిన సందర్భంలో హామీనిచ్చినట్లు కార్మికులు వివరిస్తున్నారు. ఈనేపథ్యంలో సత్వరమే ఎనిమిది నెలల పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కార్మికులతోపాటు సిఐటియు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేనట్లయితే ఉద్యమబాట తప్పదని వారు హెచ్చరిస్తున్నారు.

---

**నోటీసు**

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, జూనియర్ డివిజన్, పొన్నూరువారి కోర్టులో**

**ఐ.ఎ.16/2025 ఇన్ ఇ.పి.నెం.18/2021**

**ఇన్ ఎ.టి.సి.నెం.2/2003**

ముసునూరి సత్యనారాయణ.
ఎదిరి ...పిటీషనర్.

డా॥ తుమ్మల ఇందిరాదేవి మరియు ఇతరులు .. ...రెస్పాండెంట్స్.

టు
డా॥ తుమ్మల ఇందిరాదేవి, భర్త : వీరయ్య, నౌలూరు గ్రామము, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా.

ముసునూరి సత్యనారాయణ, S/O. బసవయ్యగారు ఎ.టి.సి.నెం.2/2003 షెడ్యూలులో సర్వే నెంబరు 56/2 లో య 0.10 సెంట్లకు, సర్వే నెం.56/3లో య 0.10 సెంట్లుగా సవరణ కోరుచు పిటీషను దాఖలు చేసినందున యిందు విషయమై ఆక్షేపణలున్న 2025 సం॥ సెప్టెంబరు నెల 17వ తేది పగలు 10 గంటలకు ఖుద్దునగాని, వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై కోర్టు వారితో మనవి చేసుకోవలసినది. లేని యెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురని తెలియ చేయడమైనది.

ముసునూరి సత్యనారాయణ,
పిటీషనరు.

---

**IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: GOOTY**

**H.M.O.P.No. 229/2024**

**Between:**
P. Rajasekhar Naidu ...**Petitioner**
**AND**
Smt P.Durga Venkata Ratnam @ Lakshmi ...**Respondent**

**NOTICE TO THE RESPONDENT**

**TO,**
Smt Durga Venakta Ratham @ Lakshmi, W/o P.Rajasekhar Naidu, D/o Sreenivasa Rao, R/o D.No. 4-170, Sagaria peta, Veerapunayuni Gudem, Gannavaram Mandal, Krishna District పై అర్జీదారుడు నీతో శ్రీకనకదుర్గమ్మ దేవాలయములో 10.06.2023వ తేదిన జరిగిన వివాహమును రద్దుపరచుకొనుటకుగాను నీ పై అర్జీని పై కోర్టులో దాఖలు చేసుకొనినారు. కోర్టు వారు సదరు అర్జీని 08.09.2025వ తేదికి నీ హాజరు నిమిత్తము వాయిదా వేసినారు. కావున నీవు 08.09.2025వ తేదిన ఉదయం 10–00 గంటలకు పై కోర్టులో హాజరై ఆక్షేపణలున్న యెడల తెలుపుకొనవలయుననియు, లేనంతట నీ పరోక్షమునందు తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(By order of the Court)
**R.V. CHALAPATHI,**
**ADVOCATE FOR THE PETITIONER,**
**GOOTY.**

---

**In The Court of the IV Addl. civil Judge (Junior Division) of Vijayawada.**

**I.A.No : 66/2025 in OS No:1936/2024**

**Between :**
**State Bank of India,**
**Rep.by its chief Manager -- Petitoner / Plaintiff**
**and**
**M/S. Sri Balaji Family Restaurant,**
**Rep. by it's Prop. Doddukuri VenkatRao,**
**S/o. Venkateswarlu, R/o. Flat No : 507,**
**Radhas Cherukuri Paradise, MainRaod,**
**Guntupalli - 521456, NRT Dt.**
**-- Respondant / Defedant**

పైనెంబరు పిటీషన్‌లో రెస్పాండెంట్‌కు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనని కారణంగా కోర్టు వారు ఈ పబ్లికేషన్‌ను ఆర్డర్ చేయుచూ ది. 25-08-2025వ తేదీన ఉ.10.30లకు రెస్పాండెంటు స్వయంగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెల్పుకొనవలెను.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

విజయవాడ,
తేది. 18.8.2025.

ఇట్లు
**ఎం.కోటినాగయ్య**
వాది తరపు అడ్వకేట్, కృష్ణలంక, విజయవాడ.
సెల్ : 9866561358

# అట్రాసిటీ కేసులు సత్వర పరిష్కారానికి చర్యలు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ డికె బాలాజీ

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ సమావేశపు హాలులో జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావుతో కలిసి జిల్లా విజిలెన్స్ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో, పౌర హక్కుల రక్షణ చట్టం 1955, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నివారణ చట్టం 1989, మాన్యువల్ స్కావెంజింగ్ చట్టాల అమలు తీరును ఆయన కమిటీ సభ్యులతో చర్చించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసుల వివరాలు, బాధితులకు తక్షణ పరిహారం అందించేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి కషి చేయాలని సూచించారు. ఈ క్రమంలో ఆయన జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు ఎన్ని నమోదయ్యాయి, వాటిలో ఎన్ని చార్జిషీట్లు ఫైల్ చేశారు, కేసులను ఫైల్ చేయడంలో జాప్యానికి గల కారణాలు, ఇప్పటివరకు అట్రాసిటీ బాధితులకు నష్టపరిహారం ఎంత అందించారని ఆయన డివిజన్ల వారీగా సమీక్షించారు. పౌర హక్కుల రక్షణ చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీల నివారణ చట్టం అనేవి అణగారిన వర్గాలపై, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై వివక్ష, దౌర్జన్యాలను తొలగించడం లక్ష్యంగా పెట్టుకున్న రెండు ముఖ్యమైన భారతీయ చట్టాలు అని, అవి సక్రమంగా అమలయ్యే విధంగా అధికారులు సమన్వయంతో కషి చేయాలని సూచించారు.కేసుల పరిష్కారం కోసం సబ్ డివిజన్ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా సమీక్షించాలని ఆయన ఆర్డీవోలు, పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు తక్షణ న్యాయం చేసేలా పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో కె చంద్రశేఖర రావు, కెఆర్ఆర్సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, మచిలీపట్నం, అవనిగడ్డ, గుడివాడ, గన్నవరం డీఎస్పీలు సిహెచ్ రాజా, జి శ్రీనివాసరావు, ధీరజ్ వినీల్, సిహెచ్ శ్రీనివాసరావు, మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే స్వాతి, జి బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారోన్, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు షేక్ షాహిద్ బాబు పాల్గొన్నారు.




## ర్యాగింగ్‌కు పాల్పడితే జీవితం నాశనం : జడ్జి

**ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** విద్యార్థిని, విద్యార్థులు తమ జూనియర్ ల పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలని, అలా కాకుండా ర్యాగింగ్ లాంటి వికృత క్రీడకు పాల్పడితే జీవితం ముగిసినట్లే అని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కెవి. రామకష్ణయ్య పేర్కొన్నారు. సోమవారం కృష్ణా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాగింగ్, డ్రగ్స్ వ్యతిరేక అవగాహనా సదస్సులో ఆయన ప్రధానోపాన్యాసం చేశారు. ఎక్కడో ఇంగ్లాండ్ దేశంలో వైద్య కళాశాలల్లో ప్రారంభమైన ర్యాగింగ్ మన దేశానికి పాకి రాక్షస క్రీడ గా మారి జీవితాలు ఫణంగా పెట్టే పరిస్థితికి రావడంతో ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకొచ్చాయన్నారు. అలాగే నేడు మత్తు పదార్థాలు వాడకం వల్ల యువత చెడుమార్గాలు పట్టే ప్రమాదం ఉందని, వాటిని అరికట్టడానికి అందరూ కషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం ఎల్ రాణి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇంచార్జి ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎంఇఓను కలిసిన యుటిఎఫ్ నాయకులు

**ప్రజాశక్తి-మొవ్వ :** మొవ్వ మండల నూతన మండల విద్యాశాఖాదికారి (యంఈఓ-1)గా బాద్యతలు తీసుకున్న ఎ.భానుప్రకాష్‌ని యుటిఎఫ్ మొవ్వ మండల శాఖ నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ మొవ్వ మండల అధ్యక్షులు యం.రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి యం. రత్న గిరిరావు, గౌరవ అధ్యక్షులు పాగోలు రమేష్ బాబు, మండల కార్యదర్శులు వి. నాగశ్రీనివాసరావు పాల్గొన్నారు.

**పాఠశాలల తనిఖీ :** ఎంఇఒ భాను ప్రకాష్ సోమవారం తొలిసారిగా నిడమోలు జిల్లాపరిషత్ హై స్కూల్ ప్లస్ (బాలికల జూనియర్ కళాశాల), కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హై స్కూల్.లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈనెల 11 నుంచి 14 వరకు జరిగిన ఎఫ్.ఎ-1 పరీక్షల పుస్తకాలను మూల్యాంకనంలను పరిశీలించి విద్యార్థులకు నూతన పరీక్ష విధానంపై అవగాహన కల్పించారు. అలాగే ఉపాధ్యాయ వివరాలు, విద్యార్థుల హాజరుపై ఆరాతీశారు.

## మునిగిన పంటలు పరిశీలన

**ప్రజాశక్తి-చల్లపల్లి :** అధిక వర్షాలు,ముంపు కారణంగా స్థానిక మండలం నడకుదురు పరిధిలోని నీటి ముంపుకు గురైన వాణిజ్య పంటలను ఉద్యానవన శాఖ అధికారిణి కీర్తి సోమవారం పరిశీలించారు. పసుపు, కంద, అరటి తోటలు 25 ఎకరాలకు నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు.

## 26లోపు నూతన బార్లకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ :** మద్యం వ్యాపారంలో ఉన్న వ్యక్తులకు అనుకూలంగా ప్రభుత్వం కొత్త బార్ పాలసీ తీసుకొచ్చిందని కృష్ణా జిల్లా ఎక్సైజ్ శాఖ సహాయ పర్యవేక్షణ అధికారి జి గంగాధర్ రావు పేర్కొన్నారు. నూతన బార్ పాలసీ విధానంపై మచిలీపట్నంలోని కార్యాలయంలో సోమవారం పత్రికల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాజిల్లాలో ఇప్పటివరకు 32 బార్లు నడుస్తున్నాయని అయితే గతంలో మంజూరై రెన్యువల్ కానీ ఐదు బార్లతో కలిపి మొత్తం 39 బార్లు నడుస్తాయని చెప్పారు. వీటిల్లో నాలుగు కల్లుగీత కార్మికులకు కేటాయించామన్నారు. ఏడు బార్లు జనరల్ కేటగిరీలో కేటాయించమన్నారు. జనరల్ కేటగిరీలో దరఖాస్తు చేసేవాళ్లు ఆగస్టు 26వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, 28వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో లాటరీ తీయబడుతుందని వివరించారు. కల్లుగీత కార్మికులకు కేటాయించిన బార్లకు సంబంధించి నోటిఫికేషన్ 20వ తేదీన వెలవడుతుందని 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 30వ తేదీన కలెక్టర్ కార్యాలయంలో కల్లుగీత కార్మికుల కు కేటాయించిన బార్లకు లాటరీ తీస్తామన్నారు. దరఖాస్తులు ఆన్లైన్లో, ఆఫ్లైన్లో ,హైబ్రిడ్ మోడ్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా దరఖాస్తు తీసుకోవచ్చు అన్నారు. జిల్లాలో కొత్తగా వస్తున్న 39 బార్లలో తాడిగడప పద్నాలుగు, మచిలీపట్నం 10, గుడివాడ 10, పెడన ఒకటి, ఉయ్యూరు 1, అవనిగడ్డ రెండు, మంగినపూడి బీచ్ 1 కేటాయించగా, అవనిగడ్డ మంగినపూడి టూరిజం క్యాటగిరిలో బార్లు కేటాయింపు జరిగిందన్నారు. లాటరీ పద్ధతిలో భారీ సొంతం చేసుకున్న వ్యక్తులు 2028 సెప్టెంబర్ 31 వరకు నడుపుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఏఈఎస్ సి భార్గవ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎంఇఒకు అభినందనలు

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలంలోని అంగలూరు బాలికల ఉన్నత పాఠశాల రాష్ట్రస్థాయి లో ఉత్తమ పాఠశాలగా ఎంపికైన సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అయినా ఎంఈఓ-1 జి. జగన్ మోహన్ రావును సోమవారం ఎంఈఓ 2 జి గోపాల రావు, సీఆర్పీలు, ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్మోహన్ మోహన్‌రావు ఆ పాఠశాలకు చేసిన సేవలను కొనియాడారు.

## విరాళాలు అందజేత

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ దేవస్థానాల పునర్నిర్మాణ పనులకు విసనగిరి సన్యాసి రావు, చంద్రమ్మ దంపతుల స్మారకార్థం రూ.20 వేలతో పాటు విసనగిరి అప్పలస్వామి స్మారకార్థం మనవడు పోతురాజు రూ.10వేల విరాళాలు ఇచ్చారు. ఈ విరాళాల్ని గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందించారు. అలాగే శనగశెట్టి దుర్గాప్రసాద్ జ్ఞాపకార్థం కుమారుడు శేషుబాబు రూ.10,116ను అందించారు. వల్లభనేని రామచంద్రరావు (బాబ్జి) స్మారకార్థం కుమారుడు వల్లభనేని కష్ణ(యూఎస్ఏ) రూ.50వేలను అట్లూరి అమర్ ద్వారా అందించారు. కాళేపల్లి అనిల్‌కుమార్, నాగ షర్మిళ రూ.15,116ను అందజేశారు. కాళేపల్లి సూర్యతేజ, విష్ణు వందన దంపతుల కుమార్తె లాస్యశ్రీ మాన్వి రూ.10,116 అందించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చవితి ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి : సిఐ



**ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ :** మచిలీపట్నం నగర పరిధిలో గల పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ పట్టణ/ గ్రామాలలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఉత్సవాలు నిర్వహించ దలచిన వారు ముందస్తుగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని ఆర్ పేట సిఐ ఏసుబాబు తెలిపారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ కమిటీలు పాటించాల్సిన నియమ నిబంధనలను సోమవారం పత్రికల సమావేశంలో వివరించారు. ఉత్సవాలు మొదల నుంచి చివరి వరకు ప్రశాంతంగా జరిపేలా కమిటీ వారిదే పూర్తి బాధ్యత అని గుర్తించాలన్నారు.పబ్లిక్ ప్రదేశాలలో విగ్రహాలు ఏర్పాటు చేయువారు సంబంధిత మున్సిపాలిటీ/పంచాయితీ వారి అనుమతి తీసుకోవాలన్నారు.సొంత స్థలాలలో గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేసేవాళ్లు అట్టి స్థలానికి సంబంధించిన యజమాని అనుమతి తప్పనిసరిగా పొందవలెనన్నారు. విగ్రహాలు ఏర్పాటు చేయు ప్రదేశాలలో ప్రజలకు గాని ట్రాఫిక్ గాని ఎటువంటి ఆటంకాలు కలగజేయరాదన్నారు. పోలీస్ స్టేషన్ ద్వారా డీఎస్పీ వద్ద అనుమతి తీసుకుని మాత్రమే పూజా కార్యక్రమాలలో, ఊరేగింపులలో మైకులు సౌండ్ బాక్స్ లు వంటివి పెట్టుకోవాలన్నారు. ప్రజలు ఎవరు ఇబ్బంది పడకుండా సౌండ్ పెట్టుకోవాలని సూచించారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాశక్తి-గన్నవరం :** సీజనల్ గా వచ్చే జ్వరాలతో జాగ్రత్త గా ఉండాలని ఆత్కూరు పి.హెచ్.సి. హెల్త్ సూపర్వైజర్ అంకూరి నాగ మల్లేశ్వర రావు చెప్పారు. సోమవారం తెంపల్లి గ్రామ పంచాయతీలో ఆశా వర్కర్లు దుర్గా, మేరి, బల్లిపర్రు ఏరియాలో ఆశ వర్కర్ శకుంతలలు జ్వరాల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ..ఇంటిలో ఉన్న నీటి నిల్వల మీద దోమలు గ్రుడ్లు పెట్టకుండ మూతలు వేయవలెననీ, ఇంటి పరిసరలలో తాగి వదిలేసిన కొబ్బరిబోండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు రాతిరుబ్బరాలు, పనికి రాని ఏయిర్ కూలర్స్ ఉంచకుండ చూడవలెనని తెలిపారు. ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండ జాగ్రత్త వహించవలెనని పేర్కొన్నారు. నీటి తొట్టెలను ప్రతి శుక్రవారము ఖాళీ చేసి అరబెట్టి మరల నింపుకోవలెనన్నారు. ఎయిర్ కూలర్లు, ఏయిర్ కండీషనర్లు, ఫ్లవర్ వాజ్లు, జంతువులు, పక్షులు నీరు తాగుటం కోసం ఉంచె తొట్టెలలోని నీటిని మూడు రోజులకొకసారి మార్చవలెనన్నారు.

# వర్షాలకు పంటలు మునక

**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం మండలం ముస్తాబాద్, వెదురుపావులూరు, పురుషోత్తపట్నం గ్రామాల్లో వరి పైరు నీట మునిగింది. గత ఆరు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ఇంకనూ నీరు ఎక్కువవుతుంది. నాట్లు వేసి 30 రోజులు అవుతోంది. వాన నీటిలో వరి పైరు మునిగి ఉండటం వల్ల పాడైపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి పదివేలు పెట్టుబడి అయిందని, ఆదిలోనే ఇబ్బంది అవుతుందని చెబుతున్నారు.

**ముంపు బారినే పొలాలు**

**ప్రజాశక్తి-కోడూరు :** వర్షం కురిసి ఆరు రోజులు గడిచినా కోడూరు మండలంలో పలుచోట్ల వరి పొలాలు ముంపు బారి నుంచి బయట పడలేదు. వాయుగుండం ప్రభావంతో సముద్రం ఎగతన్నడంతో డ్రెయిన్లలో మురుగు నీరు దిగువకు పారే పరిస్థితి తక్కువగా ఉంది. దీంతో వరి పొలాలు మునకలోనే ఉండి వరి దుబ్బులు కుళ్లి పోతున్నాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మరోపక్క వలకట్లు తీసి నట్లు తీసి రాత్రి సమయంలో వేస్తున్నారని సంగమేశ్వరం లాకుల వద్ద ఉన్న ఒక్క వల కట్టు పాట లక్షల్లో ఉంటుందని అందుకే వలకట్లు పాటదారులు రాత్రి సమయంలో వేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కోడూరు మండలంలోని లింగారెడ్డిపాలెం, వి.కొత్తపాలెం, మాచవరం, చినగుడుమోటు, దింటిమెరక, కోడూరు గ్రామాల్లో వరిపొలాలు ఇంకా నీటిలోనే ఉండడంతో రైతన్నల ఆశలు నీరు కారి పోతున్నాయి. రత్నకోడు డ్రైన్ ప్రక్షాళన పనుల్లో, వలకట్ల తొలగింపు పనుల్లో నిర్లక్ష్యం, కారణంగానే నేడు తమకు ఈ పరిస్థితి ఎదురైందని రైతులు వాపోతున్నారు. ముంపుకు గల ప్రధాన కారణాలను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



గన్నవరం మండలం ముస్తాబాద్లో మునిగిన వరి



కోడూరు మండలంలో నీటిలోనే ఉన్న పొలాలు

# ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** నగరంలో ప్రపంచ గిరిజన దినోత్సవం, ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం బందరురోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జాతీయ స్థాయి ఫొటో ప్రదర్శన వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి సౌజన్యంతో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా ఏపి టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ డా.నూకసాని బాలాజీ మాట్లాడుతూ ఎక్కడ్కెనా ప్రజల స్థితిగతులు, వారి జీవన విధానం తెలియజేసేది ఫొటోగ్రఫీ అని అన్నారు. సీఎం చంద్రబాబు కూడా ఫొటోగ్రఫీ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. టూరిజం అభివృద్ధి జరగాలంటే ఫొటోగ్రఫీ ద్వారా అక్కడ పరిస్థితులు, ఆ ప్రాంత గొప్పతనాన్ని ఆకర్షించినప్పుడే జరుగుతుందన్నారు. ప్రపంచ గిరిజన దినోత్సవం సందర్భంగా గిరిజనుల జీవన విధానాలు కళ్లకు కట్టినట్లు తెలిపిన నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు టి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 16 రాష్ట్రాల నుండి 487 ఎంట్రీలు వస్తే కేవలం 40 ఫొటోలు మాత్రమే ఎంపికయ్యాయని అన్నారు. సావనీర్ విడుదల చేశామన్నారు. 60 వేల నగదు మొదటి బహుమతి, పాల్గొన్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్‌తో పాటు గోల్డ్‌మెడల్ ఇస్తున్నట్లు తెలిపారు. శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జాతీయ నుండి అంతర్జాతీయ స్థాయికి ఫొటోగ్రఫీని తీసుకువచ్చిన టి.శ్రీనివాసరెడ్డిని అభినందించారు. మాజీ పార్లమెంట్ సభ్యులు గోకరాజు గంగరాజు మాట్లాడుతూ ఈస్థాయిలో ఫొటోగ్రఫీ రంగంలో వుండటానికి పలువురు మహనీయులు ఎందరో సేవలు అందజేశారన్నారు. బ్లాక్ అండ్ వైట్ ఫొటోగ్రఫీ రంగం నుండి ఇప్పటి కలర్ వరకు అంచెలంచెలుగా ఎదుగుతూ దానితో పాటు చిన్నపాటి కెమెరా నుండి ఇప్పటి అత్యాధునిక కెమెరాలను వాడుకునే స్థాయికి ఎదిగిన ఫొటోగ్రఫీ రంగం ద్వారా తనవంతు సేవలందిస్తూ మొట్టమొదటిసారిగా గిరిజన సంస్కృతిని వారికి వెలుగులోకి తెచ్చిన నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిఆర్‌కె-పోలవరపు సాంస్కృతిక సమితి గోళ్ల నారాయణరావు, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు సుందర్ కొపల్లి, ఏపి సృజనాత్మకత సంస్కృతి సమితి డైరెక్టర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.


వేడుకలను ప్రారంభించి బహుమతులు అందజేస్తున్న మండలి బుద్ధప్రసాద్, గోకరాజు గంగరాజు

## పిఎసిఎస్ అధ్యక్షునిగా సురేష్‌బాబు బాధ్యతలు

**ప్రజాశక్తి-నందిగామ:** అడవిరావులపాడులో సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రెసిడెంట్ గరిమిడి సురేష్‌బాబును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లాల్ బహదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, టిడిపి మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



## జివి మాల్ ప్రారంభం

**ప్రజాశక్తి-నందిగామ:** నందిగామలో ప్రముఖ సినీ నటి, టివి యాంకర్ అనసూయ సోమవారం సందడి చేశారు. నందిగామ గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డులో జివి మాల్ ప్రారంభోత్సవానికి అనసూయ విచ్చేశారు. సినిమా పాటలకు స్టెప్పులు వేసి సందడి చేశారు. కుటుంబ సభ్యులతో గడిపేందుకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నానని అనసూయ తెలిపారు. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నానని తెలిపారు. అనసూయను చూసేందుకు భారీగా జనం తరలివచ్చారు.



## రఘునందన్‌కు సత్కారం

**ప్రజాశక్తి-తిరువూరు:** విజయవాడలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన నూతన సాహితీ సంస్థ, విశ్వ సాహితీ కళావేదిక ఆవిర్భావ సభలో నిర్వహించిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో తిరువూరుకు చెందిన కవి రేపాక రఘునందన్‌కు కవి సత్కారం లభించింది. విముక్తి గీతం అనే వచన కవితను గానం చేసిన రఘునందన్ సాహితీవేత్తల, నిర్వాహకుల ప్రశంసలు అందుకున్నారు. అనంతరం రఘు నందన్‌ను సన్మానించి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు.



## వెలగని వీధి లైట్లు

**ప్రజాశక్తి-వత్సవాయి:** పోలంపల్లి గ్రామంలో గత నెల రోజుల నుండి విద్యుత్ దీపాలు వెలగకపోవటంతో గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో విద్యుత్ దీపాలు వెలగకపోవడమే కాకుండా, అధికారులు పట్టించుకోవటం లేదని ఎవరు చేస్తున్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో దుకాణాలకు, కిరాణా షాపులకు, మందుల షాపులకు, వెళ్లాలంటే చీకట్లో భలే ఇబ్బందులకు గురవుతున్నారని తెలుపుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్లపైకి పాములు తేళ్లు వీధి కుక్కలు ఉండటంతో భయాందోళన గురవుతున్నారని తెలుపుతున్నారు. మహిళలు సైతం రాత్రి వేళల్లో కిరాణా షాప్ కి వెళ్లి రావాలంటే భయ ఆందోళనకు గురవుతున్నారు. పోలంపల్లి గ్రామంలో డ్రైనేజీల నిండిపోవడంతో మురుగునీరు కాలవలోనే నిలిచిపోతున్నాయని గ్రామ ప్రజలు ఆపోతున్నారు. మురికి నీరు కాలవల్లోనే నీళ్ల నిలవ ఉండటంతో దోమలకు ఆవాసాలుగా మారాయి. దోమలు కూడా విస్తరించి పోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు కాలవల్లో పూడికలు తీయించాలని గ్రామ ప్రజలు అంటున్నారు.

## దుర్గగుడిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలన

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ:** బెజవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.కె. శీనా నాయక్, ఇంజనీర్లు, పారిశుధ్య మరియు భద్రతా సిబ్బందితో కలిసి సందర్శకుల సౌకర్యాలపై క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో యాత్రికులకు స్వచ్ఛమైన తాగునీరు, సరైన పారిశుద్ధ్యం మరియు చక్కగా నిర్వహించబడే మరుగుదొడ్ల లభ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆలయాన్ని సందర్శించే యాత్రికులకు మెరుగైన అనుభవాన్ని అందించే లక్ష్యంతో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని కూడా అంచనా వేశారు. భారీ వర్షాలపై ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, భారీ వర్షాల వల్ల తలెత్తే సమస్యలు, ముఖ్యంగా పారిశుధ్యం మరియు మురుగునీటి పారుదల వ్యవస్థలకు సంబంధించిన అంశా ఇఒ దృష్టి సారించారు.

## సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

**ప్రజాశక్తి-తిరువూరు:** తెలంగాణలో జమీందారుల దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమించి అణగారిన ప్రజల కోసం విరోచిత పోరాటం చేసిన స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ పాపన్న గౌడ్ అని సినీ నటుడు సుమన్ అన్నారు. తిరువూరు బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పాపన్న గౌడ్ విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సుమన్ మాట్లాడుతూ బిసి సామాజిక వర్గంలోని పేద కుటుంబంలో జన్మించిన పాపన్న చిన్ననాటి నుండి జమిందార్ల పీడన నుండి ప్రజలను విముక్తి చేసేందుకు ఒక ప్రత్యేక సైన్యా న్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా తన లక్ష్యాన్ని అధిగమించారని కొనియాడారు. అటువంటి మహనేత విగ్రహాన్ని తిరువూరులో ఆవిష్కరించే అదృష్టం కలగడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరసా బాబురావు, గౌడ్ సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





## మండల కేంద్రం తరలింపు అవాస్తవం

**ప్రజాశక్తి-వీరులపాడు:** మండల కేంద్రాన్ని జుజ్జూరు నుంచి వీరులపాడుకు మార్పుపై మీడియాలో వస్తున్న కథనాలపై సోమవారం జుజ్జూరు గ్రామంలో అఖిలపక్షం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. మండల మార్పుపై వస్తున్న కథనాలపై ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను కలవగా వీరులపాడుకు మండల కేంద్రాన్ని తరలించాలని పత్రికలలో వచ్చిన వార్త అవాస్తవమని, ఎటువంటి ప్రకటన కాని మెమోరాండం కానీ ఇవ్వలేదని ఆమె తెలిపారన్నారు. కోర్టు ఎటువంటి తీర్పు విడుదల చేసినా ఆ తీర్పుకు బద్దులై ఉంటామని ఎమ్మెల్యే చెప్పారన్నారు. జుజ్జూరు మండల కేంద్రంగా మండలంలో 16 గ్రామాలకు మధ్యలో ఉండటం వల్ల అన్ని రకాలుగా సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. రవాణా సౌకర్యం కూడా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాపా రాంబాబు, యర్రగుంట కృష్ణారావు, మాదాల కోటయ్య, కాంగ్రెస్ పార్టీ పిసిసి మెంబర్ దేవరకొండ శ్రీనివాసరావు, జనసేన నాయకులు పసుపులేటి వరకుమార్, కోటయ్య , జుజ్జూరు గ్రామ ఉప సర్పంచి పసుపులేటి సాయిబాబు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి రాధాకృష్ణ మృతి

**ప్రజాశక్తి-వీరులపాడు:** మండలంలోని ఏర్పుపాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి వాసిరెడ్డి రాధాకృష్ణ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. రాధాకృష్ణ మృతదేహాన్ని టిడిపి మండల అధ్యక్షులు కొండరగంట్ల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు మధుసూదన్‌రావు, వీరులపాడు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు చల్లా శ్రీనివాసరావు, వైసిపి నాయకులు కోటేరు ముత్తారెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆవుల రమేష్‌బాబు, సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, కోడూరు పిచ్చేశ్వరరావు, వట్టికొండ పార్థసారథి, సిపిఐ నాయకులు అక్కినేని వనజ, వట్టికొండ చంద్రమోహన్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

## సహకార సంఘాలతోనే రైతులకు మేలు

**ప్రజాశక్తి-గంపలగూడెం:** గ్రామీణ ప్రాంతాలలో సహకార సంఘాల ద్వారా రైతులు రుణాలు పొంది వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు ముందడుగు వేస్తున్నట్లు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. గంపలగూడెం పిఎసిఎస్ నూతన నూతన ఛైర్మన్‌గా పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ కేతేపల్లి సత్యంబాబు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇది రైతు ప్రభుత్వమని తెలియజేస్తూ, సత్యం బాబు ఆధ్వర్యంలో రైతులకు మేలు జరగాలని కోరారు. రైతులకు ఎటువంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు రుణాలు మంజూరు చేయడంలో ముందుండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, తిరువూరు ఏఎంసీ ఛైర్మన్ రేగళ్ల లక్ష్మీ అనిత, గ్రామ సర్పంచ్ కోట పుల్లమ్మ, నాయకులు రేగళ్ల వీరారెడ్డి, కాజా రవికుమార్, మాజీ ఛైర్మన్ యాసారపు ముత్యాలరావు, కోట వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



# తెలుగు కార్యశాల ప్రారంభం

**ప్రజాశక్తి-ఎడ్యుకేషన్:** భాషా సంస్కృతులు జాతికి జవజీవాలు అని, ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతి ఒక్కరు మాతృభాషతో పాటు మరొక భాషలో ప్రావీణ్యం సముపార్జించాలని సిద్దార్థ అకాడమి జాయింట్ సెక్రెటరీ నిమ్మగడ్డ లలిత ప్రసాద్ అన్నారు. సోమవారం విజయవాడలోని పి.బి. ద్దార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వెబినార్ హాలులో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్, నేషనల్ టెస్టింగ్ సర్వీస్-ఇండియా (మైసూరు), పి.బి. సిద్దార్థ కళాశాల తెలుగుశాఖ సంయుక్త నిర్వహణలో తెలుగులో పరీక్ష మూల్యాంకనం, ప్రశ్నాంశ రచనపై ఆరురోజుల శిక్షణశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యశాలకు అధ్యక్షత వహించిన కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ కృత్రిమమేధ వినియోగంలోకి వచ్చిన రోజుల్లో సంప్రదాయ పరీక్షలు, మూల్యాంకనం రూపురేఖలు మారనున్నాయని చెప్పారు. కార్యక్రమ ఉద్దేశాన్ని సిఐఐఎల్ రిసోర్స్ పర్సన్ డా.ఎం.నారాయణరెడ్డి వివరిస్తూ దేశవ్యాప్తంగా ప్రముఖ విద్యాసంస్థల్లో జాతీయ పరీక్ష సేవా కేంద్రం 300 శిక్షణ శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. సహాయాచార్యులు డా. ఎన్.శివకుమార్ కీలక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సీనియర్ ఫెలో డా.కె.రవిబాబును డీన్ ఆచార్య రాజేష్ సి.జంపాల సత్కరించారు. తెలుగు సాహిత్యంపై ఆంధ్రా లయోలా కళాశాల విశ్రాంత ఉప ప్రాచార్యులు డా.గుమ్మా సాంబశివరావు, జాతీయ విద్యావిధానంపై కంచికచర్లలోని ఎస్.డబ్ల్యు.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు విభాగాధిపతి డా.కె.బాలకృష్ణ తెలుగు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు బోధనా తరగతులు నిర్వహించారు. సహాయాచార్యులు డా. సత్రి సభను నిర్వహించారు. ఈ నెల 20 వరకు తెలుగు శిక్షణా తరగతులు కొనసాగుతాయి.


మాట్లాడుతున్న లలితప్రసాద్

### ఆదాయం వస్తే చాలు..

# ఎక్కడైనా మత్తెక్కిస్తాం...

- రహదారుల వెంటే మద్యం దుకాణాలు
- సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు
- మద్యం మత్తులో ప్రమాదాలు

**ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం నియోజకవర్గంలో ఉంగుటూరు, బాపులపాడు, గన్నవరం, విజయవాడ రూరల్ మండలాలు ఉన్నాయి. సుమారు 29 షాపుల వరకు మద్యం దుకాణాలు ఉన్నాయి. బెల్ట్ షాపులు వందల్లో ఉన్నాయి. మండల కేంద్రాలకు బయటి ప్రాంతాల నుంచి రోజూ 25 వేల మంది పట్టణాలకు వస్తుంటారు. వీరిలో కొందరు విద్య, వైద్య అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రయాణ, సరకు రవాణా వేగంగా జరగడానికి రహదారులు నిర్మించారు. ఇలాంటి కీలకమైన రోడ్ల పక్కనే నిర్వాహకులు మద్యం దుకాణాలు పెట్టి ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. కూలీలు, కార్మికులు, సాధారణ ప్రజలు విపరీతంగా మద్యం తాగుతున్నారు. షాపుల్లో కొని వాటి ముందే మందు తాగడం జరుగుతుంది. దీని గురించి పట్టించుకునేవారు లేరు.

**ఇవీ నిబంధనలు ...**

గ్రామాల్లో ఎక్కడైనా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలతోపాటు మసీదులు, చర్చిలు, 30 పడకలకు పైగా ఉన్న ఆసుపత్రులకు మాత్రం వంద మీటర్ల దూరంలో ఉండాలి. మండల కేంద్రాలు, పంచాయతీల మీదుగా జాతీయ రహదారులు వెళ్తుంటే 220 మీటర్ల వరకు దుకాణాలు నెలకొల్పకూడదు. లైసెన్సు ఇవ్వడానికి ముందే ఎక్సైజ్ శాఖ ఈ నిబంధనల గురించి స్పష్టంగా చెప్పింది. ఇందుకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేయకూడదని పేర్కొంది. ఎవరైనా అతిక్రమించినా చర్యలు తప్పవని హెచ్చరించింది. గన్నవరం నియోజకవర్గంలోని ఉంగుటూరు, గన్నవరం, బాపు లపాడు, విజయవాడ రూరల్ మండలాల్లో రహదారుల వంట చాలా షాపులు వెలిచాయి. మందు బాబులతో కిక్కిరిసిపోతున్నాయి.

**మద్యపానం ఆరోగ్యానికి హానికరం' ఇది ఎక్సైజ్ శాఖే చెప్పేమాట. అదే మద్యం దుకాణాలు జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కనే ఉంటే ఆరోగ్యం సంగతి పక్కన పెడితే విలువైన ప్రాణాలు రోడ్డు ప్రమాదాల కారణంగా క్షణాల్లో గాలిలో కలవడం ఖాయం. ఇటువంటి ఘటనలు జరగకూడదనే ఉద్దేశంతోనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పలు నిబంధనలు విధించింది. వీటిని ఏ మాత్రం లెక్క చేయకుండా మద్యం దుకాణాల నిర్వాహకులు రోడ్డుకు ఆనుకుని కొన్నిచోట్ల, సమీపంలోనే మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవడానికి మీనమేషాలు లెక్కించడంపై విమర్శలు వస్తున్నాయి.**



**తాత్కాలికమని చెప్పి శాశ్వతంగా..**

మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీలలో రోడ్ల పక్కనే మద్యం దుకాణాలు పెట్టారు. ఎక్సైజ్ శాఖ అధికారులు అప్పట్లో అనుమతించారు. నెల రోజుల వ్యవధిలోనే మార్చుకోవాలని సూచించారు. ఆదాయం వస్తుండటంతో పది నెలలు దాటినా నిర్వాహకులు తాత్కాలికం ముసుగులో శాశ్వతంగా అక్కడే కొనసాగిస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే**

తేలప్రోలు, పెద్ద అవుటపల్లి, జాతీయ రహదారిలో, ముస్తాబాద్, దావాజీగూడెం, సూరంపల్లి, రామవరప్పాడు, ప్రసాదంపాడు, గన్నవరం, గొల్లనపల్లి, వీరపనేని గూడెం, ఆత్కూర్, బాపులపాడు, వీరవల్లి తదితర గ్రామాల్లో రోడ్డుకు ఆనుకునే దుకాణాలు ఉన్నాయి.

**మద్యం మత్తులో భారీ వాహనాల డ్రైవర్లు...**

అల్లాపురం, దావాజీ గూడెం, గన్నవరం, బాపులపాడు, వీరవల్లి, కేసరపల్లి, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికెపాడు, నిడమానూరు గ్రామాల్లో మోటారు రంగంలో పనిచేసే కార్మికులు వందల సంఖ్యలో ఉంటారు. హైవేను, మెయిన్ రోడ్ల ను ఆనుకునే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడంతో భారీ వాహనాల డ్రైవర్లు.. అక్కడే తాగి రోడ్డు ఎక్కుతున్నారు. ఫలితంగానే ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. వారి తప్పిదాలతో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. రామవరప్పాడు నుంచి హనుమాన్ జంక్షన్ రూట్ లో ఎక్కువగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.



## ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

**ప్రజాశక్తి-గన్నవరం, :** ఫ్లడ్ లైట్స్ వెలుగులో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాలకు చెందిన 14 జట్లు ఈ పోటీల్లో తలపడుతున్నాయి. తొలుత మూడవ రోజు పోటీలను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీఆర్. కిషోర్ ప్రారంభించారు. గ్రామీణ వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వాకర్స్ అసోసియేషన్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 19న జరిగే ఫైనల్ మ్యాచుతో ఈ పోటీలు ముగుస్తాయని తెలిపారు. ఈ పోటీల్లో వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు రూ. 21 వేలు నగదు బహుమతులు, షీల్డ్స్ అందజేయనున్నట్లు చెప్పారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తిరివీధి వెంకయ్య, టిఎస్ఆర్ కె. ప్రసాద్, ముక్కాముల సుబ్బారావు, ఎండి, అలీ, చల్లపల్లి శ్రీనివాసరావు, సగ్గుర్తి శ్రీనివాసరావు పలువురు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎంపీడీవో, కార్యదర్శిలను సన్మానిస్తున్న దృశ్యం

## అవార్డుగ్రహీతలకు సన్మానం

**ప్రజాశక్తి - గుడివాడ :** 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్రల చేతుల మీదుగా ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డు పొందిన గుడివాడ మండలం ఎంపీడీవో బి వై విష్ణు ప్రసాద్, మల్లాయ పాలెం పంచాయతీ కార్యదర్శి బి కోటయ్యలను గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. గుడివాడ మండల పంచాయతీ కార్యదర్శుల యూనిట్ గుడివాడ డివిజన్ పంచాయతీ కార్యదర్శులు అధ్యక్షుల వి హరికష్ణ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ సన్మానం కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి శ్రీనివాసరావు, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది, పాల్గొని అవార్డులు పొందిన ఎంపీడీవో, కార్యదర్శిని అభినందించారు.

## 'మీకోసం'లో అర్జీల వెల్లువ

**అక్రమంగా వేసిన తూములు తొలగించాలని వినతి**

**ప్రజాశక్తి-కోడూరు :** కోడూరు మండల పరిధిలోని ప్రధాన డ్రెయిన్ గా ఉన్నా రత్నకోడుపై కొంతమంది రైతులు అనాధికారికంగా వేసిన అక్రమ తుమ్ములను వెంటనే తొలగించాలని సోమవారం మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘానికి చెందిన జొన్నలగడ్డ రాజగోపాలరావు స్థానిక రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజగోపా ్రలావు మాట్లాడుతూ మండలంలోని అతి పెద్దదైన రత్నకోడు మురుగు కాలువ నుండి న్యూ ఇరాలి డ్రెయిన్ వైపునకు నాలుగు చోట్ల అక్రమంగా తూములను వేయడం ద్వారా ఆ నీరు అంతా తమ సాగు భూముల్లోకి వచ్చి ముంపునకు గురవుతున్నాయన్నారు. వెంటనే అక్రమ తూములను వెంటనే తొలగించాలని కోరారు.

**రహదారులపై లైట్లు ఏర్పాటు చేయాలని వినతి**

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** విజయవాడ-మచిలీపట్నం హైవే నిర్వహణ దారుణంగా ఉందని....ఆ లోపాలను సరిదిద్దాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ రాష్ట్ర కో కన్వీనర్ జంపాన శ్రీనివాస్ గౌడ్ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు.ఈ జాతీయ రహదారిపై లైట్లు వెలిగించక పోవటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఆ ప్రమాదాలను నివారించాలన్నారు. అలాగే గురజాడ నుండి ఉయ్యూరు సర్వీస్ రోడ్ల మార్జిన్‌ల నిర్వహణ సరిగా లేదన్నారు.అలాగే ఉయ్యూరు నుండి పామర్రు వరకు సర్వీస్ రోడ్ల నిర్వహణ ఇబ్బందులు తొలగించాలని కోరారు.

## డమరుకం బహూకరణ

**ప్రజాశక్తి-మొవ్వ:** కూచిపూడిలోని శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంకు కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, మొన్నటితరంనాట్య గురువు వేదాంతం పార్వదీశం మనవడు పెద్దిభొట్ల చంద్రశేఖర్ (విజయవాడ) డమరకంను సోమవారం దేవాలయ అర్చకుడు పెనుమూడి పూర్ణ చంద్రశేఖర శర్మకు అందజేశారు. ఈయనతో పాటు గ్రామస్తులు పసుమర్తి హరినాథ శాస్త్రి, ఏలేశ్వరపు వెంకటేశ్వర ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




సాయం అందిస్తున్న బండి రామకృష్ణ

## ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ :** కుటుంబ యజమాని ఆకస్మిక మరణంతో భర్తను కోల్పోయిన సునీతకు సోమవారం ఉమ్మడి కృష్ణా జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకష్ణ పది వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. మచిలీపట్నం25వ డివిజన్ కు చెందిన ఎన్నేటి ఆనందవర్మ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడం వల్ల మతుని భార్య సునీత ముగ్గురు ఆడపిల్లలతో తీవ్ర ఆవేదన లో ఉన్నారు. వారి కుటుంబ పరిస్థితులను డివిజన్ ఇంచార్జ్ పెదసింగ్ చిరంజీవి రామకృష్ణ కు తెలపగా మచిలీపట్నం జనసేన పార్టీ ఆధ్వర్యంలో బాధిత మహిళ ఎన్నేటి సునీతకు పదివేల రూపాయల నగదును అందజేశారు. పిల్లల ఉన్నత చదువుల కొరకు రామకష్ణ విద్యా సంస్థలు తరపున తన సహకారం అందిస్తానని బాధిత మహిళకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ వీరమహిళ గోపిశెట్టి అంజలి జనసేన పార్టీ నాయకులు గడ్డంరాజు, శాయన శివయ్య పాల్గొన్నారు.

## అధ్వానంగా చల్లపల్లి-నడకదురు రోడ్డు



**ప్రజాశక్తి-చల్లపల్లి :** మండల కేంద్రం చల్లపల్లి నుండి నడకుదురు వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారి గుంటలు పడి రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చల్లపల్లి ప్రధాన రహదారి అభివృద్ధిని అధికారులు మరిచిపోయారని పలువురు విమర్శిస్తున్నారు. మండల కేంద్రానికి అనుసంధానమైన వెలివోలు, నిమ్మగడ్డ, పాత నడకుదురు, నడకుదురు, పురిటిగడ్డ, రాముడు వారి పాలెం, నాదెళ్ల వారి పాలెం, యార్లగడ్డ, లంక తోట గ్రామాల ప్రజలు వివిధ పనుల పైన మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తారు. విద్యాలయాలకు నిలయముగా ఉన్న చల్లపల్లి కేంద్రానికి ఘంటసాల మండలం లంకపల్లి,శ్రీకాకుళం, గోగినేని పాలెం నుండి నిత్యం విద్యార్థులతో నిండిన బస్సులకు ఈ రహదారి ప్రధాన మార్గం. నది పరివాహక ప్రాంతంలోని వెలివోలు, నిమ్మగడ్డ, ఆముదారులంక, రాముడు పాలెం లంక భూములలోని వాణిజ్య పంటలు మార్కెట్కు రవాణాకు ఇదే ప్రధాన రహదారి. అవనిగడ్డ విజయవాడ కరకట్ట ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ బస్సులు ప్రతిరోజు 32 ట్రిప్పులతో 3 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానానికి చేరుస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి గోతులుపడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని, దీనిని అభివద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు డోకిపర్రుకు మిస్ వరల్డ్ రాక

**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మండలం లోని డోకిపర్రుకు మిస్ వరల్డ్ ఓపెల్ సుచాత చౌంగ్‌శ్రీతో పాటు మిస్ ఆసియా కృష్ణ గ్రవిడెస్, మిస్ వరల్డ్ గ్లోబల్ అంబసిడర్ సుధారెడ్డి రానున్నట్లు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంస్థల అధినేతలు పురిటిపాటి కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు తెలిపారు. రొమ్ము కేన్సర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనిలో వారు పాల్గొంటారన్నారు. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు 'పింక్ పవర్ రన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొ న్నారు.

## రేపు ఆలపాటి రమేష్ ప్రమాణస్వీకారం



**ప్రజాశక్తి-ిచిలీపట్నం అర్బన్ :** మచిలీపట్నం పరాసుపేట ఆంజనేయ స్వామి దేవస్థానం చైర్మన్‌గా ఆలపాటి రమేష్ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కమిటీ సభ్యులుగా ఐలా శివ నాగేశ్వరరావు, మోపర్తి ఉమాదేవి, విశ్వనాథపల్లి నాగరాజు, నందిపాముల శ్రీనివాసులు, జంపాల కనకదుర్గ రాజేష్, మానేపల్లి ఉషారాణి బాధ్యతలు స్వీకరించనున్నారు. దేవస్థానం అర్చకులు బద్రీనాథ్ ఎక్స్ ఆఫిషియో సభ్యులుగా కొనసాగనున్నారు. దేవస్థానం నూతన కమిటీ ఎంపిక లో తనకు ప్రాధాన్యం కల్పించిన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు సోదరులు, కూటమి నాయకులకు రమేష్ ఈ సందర్భంగా కతజ్ఞతలు తెలియజేశారు. దేవస్థానం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## మునేరుకు భారీ వరద

**ప్రజాశక్తి-నందిగామ:** ఎగువ ప్రాంతాలైన ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నందిగామలో మున్నేరుకు వరద ఉధృతి పెరిగింది. నందిగామ పెద బ్రిడ్జి, చినచిన బ్రిడ్జ్ వద్ద మునేరు ఉధతంగా ప్రవహిస్తుంది. ఇప్పటికే పంట పొలాలు వరద నీటిలోనే తేలాడుతున్నాయి. వరి పొలాలు నీటిలో నానుతున్నాయి. పోలంపల్లి మునేరు డ్యామ్ నుండి 250 క్యూసెక్కుల నీరు కిందకు వస్తుంది. మునేరు వరద ఉధృతికి 16 వేల యకరాలు వరద ముంపు కు గురై ప్రమాదం ఉంది. దాములూరు కూడలి వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. వైరాకట్టలేరు, మునేరు ఉధృతంగా ప్రవహిస్తుందడటంతో కూడలి వద్ద వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడతో రెవెన్యూ అధికారులు రాకపోకలు నిలిపివేశారు. దాములూరు కూడలి పరిసరాలలో వందలాది మంది యకరాలు నీటి ముంపుకు గురౌతున్నాయి. గత ఏడాది వచ్చిన వరదకు దాములూరు కూడలి రహదారి పూర్తిగా ధ్వంసమై కోతకు గురైంది.


ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు

## ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** ఆంధ్ర ప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని చిన్నపాటి రామ కోటయ్య ఇండోర్ స్టేడియం నందు జరుగుతున్న యువ ఆంధ్రా కబడ్డీ ఛాంపియన్షిప్ పోటీలు ఉత్సాహభరితంగా జరుగుతున్నాయి. నాలుగవ రోజు పోటీలకు ముఖ్య అతిథిగా సౌత్ సెంట్రల్ రైల్వే ట్రావెలింగ్ టికెట్ ఇన్స్పెక్టర్ కొరపాటి రాంబాబు పాల్గొని ప్రారంభించారు. నాలుగవ రోజు పోటీలలో అమరావతి క్రషర్ జట్టు 43- 38 పాయింట్లతో కష్ణా జట్టుపై విజయం సాధించింది. మరో మ్యాచ్ వైజాగ్ కమెండో జట్టు 51- 41 పాయింట్లు తో తిరుపతి రైడర్స్ జట్టుపై విజయం సాధించింది. విజయనగరం జట్టు 51 -41 పాయింట్లు తో భీమవరం జట్టు పై విజయం సాధించింది. కాకినాడ క్రాకెన్ జట్టు 43-42 పాయింట్లు తో కర్నూలు జట్టుపై విజయం సాధించింది. మ్యాచ్ లు అనంతరం బెస్ట్ ప్లేయర్స్ అవార్డ్ లను రాంబాబు అందచేశారు.




## పిఎసిఎస్ పాలకవర్గాల బాధ్యతలు

**ప్రజాశక్తి-తిరువూరు:** ముష్టికుంట్ల, మునకుళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) పాలక వర్గాల ప్రమాణ స్వీకారం టిడిపి నాయకుల, కార్యకర్తలతో పాటు రైతుల మధ్య కోలాహలంగా జరిగింది. ముష్టికుంట్ల పిఎసిఎస్ అధ్యకులుగా గద్దె అనిల్, మునకుళ్ల పిఎసిఎస్ అధ్యక్షులుగా వెదురు వెంకట నర్సిరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. సొసైటీల రైతులకు సేవ చేసే అవకాశం అధినేత చంద్రబాబు కల్పించటం పట్ల అనిల్, వెంకటనర్సిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు, మాజీ ఎంపీపి గద్దె వెంకటేశ్వరరావు, టిడీపీ మండల అధ్యక్షులు దుబ్బాక వెంకటేశ్వరరావు, నాయకులు కిలారు రమేష్, మాజీ జడ్పీటీసీ కిలారు విజయ బిందు, పీఎస్ఎస్ కార్యదర్శులు ఎన్. వెంకట రామారావు, పీ.శేషు, జి.రాణి తదితరులు పాల్గొన్నారు.



## సోనీ పవర్ సౌండ్ సిరీస్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** సోనీ ఇండియా యుఎల్టీ పవర్ సౌండ్ సిరీస్ రెండవ తరం శ్రేణిని విడుదల చేసినట్లు సోనీ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ నాయర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త శ్రేణిలో వైర్‌లెస్ పార్టీ స్పీకర్లు యుఎల్టీ టవర్ 9, యుఎల్టీ టవర్ 9ఏసీ, వైర్‌లెస్ బ్లూటూత్ స్పీకర్లు యుఎల్టీ ఫీల్డ్ 5, యుఎల్టీ ఫీల్డ్ 3, వైర్‌లెస్ డ్యూయల్ మైక్, యుఎల్టీ మైక్1 ఉన్నాయన్నారు. ఈ సిరీస్‌లోని అన్ని స్పీకర్లు శక్తివంతమైన బాస్ కోసం యుఎల్టీ బటన్‌ను కలిగి ఉంటాయని తెలిపారు. ఒకటి లేదా రెండు వేర్వేరు సౌండ్ మోడ్‌లతో సంగీతాన్ని మెరుగుపరచడం ద్వారా సిగ్నేచర్ సౌండ్ క్వాలిటీని అందిస్తాయని తెలిపారు. యుఎల్టీ పవర్ సౌండ్ శక్తివంతమైన బాస్, నిజంగా లీనమయ్యే ధ్వనిని ఇవి అందిస్తాయన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి : సుప్రజ



మాట్లాడుతున్న సుప్రజ

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట**
ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ (సిఐటీయు) చిల్లకల్లు ప్రాజెక్టు మహాసభ పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ మహాసభకు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ సుప్రజ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ కనీస వేతనాలు ఇవ్వాలని, అంగన్వాడి వర్కర్ పని భారం తగ్గించాలని, అంగన్వాడీ వర్కర్ల అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, గ్రాడ్యుటీ చట్టంలో మార్పులు తీసుకురావాలని, మినీ వర్కర్లని మెయిన్ వర్కర్లుగా జీవో ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రాజెక్టు నూతన కమిటీ ఎన్నుకున్నారు.కార్యదర్శిగా మార్కపూడి మధుకుమారి, అధ్యక్షురాలుగా అలాభి, సెక్టర్ పెనుగంచిప్రోలు మండల కార్యదర్శిగా కాకని సువర్చల, కమిటీ సభ్యులుగా నాగమణి, నాగచంద్రిక, ఉమారాణి, విశాలాక్షి, మేరి, రత్నకుమారి, విజయ, లక్ష్మి, హెల్పర్ నుండి ఖాజాబీ, మస్తానమ్మలను ఎన్నుకున్నారు.

## పి4లో వర్ధమాన్ వికాస్ భాగస్వామ్యం



**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** సమాజాన్ని పేదరికం నుంచి దూరం చేయాలనే గొప్ప లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రారంభించిన పీ4 విధానంలో మేము సైతం భాగమవుతామంటూ ప్రతిరోజూ ఎంతోమందితో పాటు ఎన్నో సంస్థలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నాయి. తాజాగా సోమవారం వర్ధమాన్ వికాస్ సంస్థ, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (విజయవాడ సెంటర్) వరుసగా 500 బంగారు కుటుంబాలు, 74 బంగారు కుటుంబాలకు మార్గదర్శనం చేస్తామంటూ పీ4తో చేతులు కలిపాయి. ఈ మేరకు సంస్థల ప్రతినిధులు కలెక్టర్ డా. జి.లక్ష్మీశకు ఆసక్తిని తెలియజేస్తూ ప్రమాణ పత్రాలు అందించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి శూన్య పేదరికం కీలకమని.. సమాజంలో పేదరికం ఆనవాళ్లు లేకుండా చేసేందుకు ఆవిష్కృతమైన పీ4లో భాగస్వాములైనందుకు వర్ధమాన్ వికాస్ సంస్థ, బిల్డర్స్ అసోసియేషన్‌లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 6,102 మంది మార్గదర్శులు 53,370 బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన్ వికాస్ సంస్థ సభ్యులు సీతల్ జైన్, దీక్షిత్ జైన్, దీక్షిత్ చౌహాన్, ప్రవీణ్ జైన్, యోగేష్ జైన్, మోనికా జైన్, ప్రియా జైన్, స్తుతి జైన్, యష్మీ జైన్ తదితరులతో పాటు బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విజయవాడ సెంటర్ ఛైర్మన్ జె.వెంకటేశ్వరరావు, సభ్యులు ఎన్‌టీ వెంకటేశ్వరరావు, బి.రాఘవరావు, వి.వెంకటేశ్వరరావు, ఎన్.నరేంద్ర తదితరులు భాగస్వాములయ్యారు.



## ల్యాప్‌టాప్, ప్రింటర్ బహూకరణ

**ప్రజాశక్తి-తిరువూరు:** పోలిశెట్టి పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలకు పూర్వ విద్యార్థులు లాప్ టాప్, ప్రింటర్ ను బహుకరణ చేశారు. పాఠశాలలో 1987-88 విద్యా సంవత్సరంలో 7వ తరగతి చదివిన విద్యార్థులు చల్లారి రామా రావు, మల్లిఖార్జున చారిలు పాఠశాలకు 62 వేల రూపాయలు విలువైన లాప్టాప్, ప్రింటర్ ను ప్రధా నోపా ధ్యాయుడు పి.శోభన్ బాబుకు సోమ వారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎంసి ఛైర్మన్ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## రోడ్డు పనుల పరిశీలన

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పట్టణంలోని విలియంపేట రైల్వే ట్రాక్ వద్ద రోడ్డు కోతకు గురైన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అక్కడికి చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో సమీక్ష జరిపి, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం జరుగుతున్న రోడ్డు మరమ్మత్తు పనులను ఎమ్మెల్యే రాజగోపాల్ స్వయంగా దగ్గరుండి పరిశీలించారు. ప్రజలకు సౌకర్యం కలగాలనే దృష్ట్యా పనులు నాణ్యంగా, వేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అట్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** చిల్లకల్లు, ఆటోనగర్ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని షేర్ మహమ్మద్ పేట, ఆటోనగర ఇండస్ట్రియల్ ఏరియా పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చిల్లకల్లు ఏఈ రమేష్‌బాబు తెలిపారు. ఆటోనగర్ సబ్స్టేషన్ పరిధిలో ఆర్డీఎస్ వర్కలో భాగంగా న్యూ ట్రాన్స్ఫార్మర్లకు సంబంధించి వైర్లు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మహిళ ఆత్మహత్య

**ప్రజాశక్తి-కంచికచర్ల:** కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామానికి చెందిన కంభం భవాని (28) అనే వివాహిత ఉరి వేసుకుని మతి చెందింది. కంచికచర్ల ఎస్సై విశ్వనాధ్ తెలిపిన సమాచారం మేరకు భవానికి 12 సంవత్సరాల క్రితం రాజశేఖర్ అనే వ్యక్తితో వివాహం అయింది. వీరికి ముగ్గురు మగ పిల్లలు సంతానము. కాగా భవానికి సుమారు 4 నెలల క్రితం కంచికచర్ల సంజీవనగర్ కాలనీకి చెందిన జంగా ప్రకాశ రావు ఎలియాస్ గోపి అనువ్యక్తితో పరిచయం అయి, అతనితో మాట్లాడుతున్నట్లు భవాని భర్తకు తెలిసింది. దీంతో గత నెల రోజుల నుండి భర్త రాజశేఖర్ ఇద్దరు పిల్లలతో కలసి స్వగ్రామం అల్లూరులో ఉంటున్నాడు. భవాని మాత్రం తన చిన్న కుమారుడుతో తన తల్లి వద్ద పేరకలపాడులో నివాసం ఉంటుంది. శనివారం అర్ధరాత్రి భవానికి ప్రకాశరావుకి మధ్య జరిగిన మనస్పర్ధాల కారణంగా భవాని అదే రోజు అర్ధరాత్రి చనిపోయింది. ఆదివారం సాయంత్రం ఇంటి ప్రక్కనివాసం ఉంటున్న భవాని మేనత్త బురదగుంట దుర్గ, భవాని ఇంటి లోపలికి వెళ్లి చూడగా భవాని ఉరి వేసుకుని అప్పటికే చనిపోయి మంచం మీద ఉన్నట్లు కంచికచర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నేతాజీకి నివాళి

**ప్రజాశక్తి-తిరువూరు:** స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ 80వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తిరువూరులోని రాజీవ్ భవన్‌లో నాయకులు, కార్యకర్తలు సోమవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి, తిరువూరు బోసుబొమ్మ సెంటర్ లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఆయన ఆజాద్ హిందు పౌజ్ స్థాపించి ఆంగ్లేయు లను భారతదేశము నుంచి తరిమివేయడం ద్వారానే భారతదేశానికి స్వాతంత్రం వస్తుందని ఉద్యమించిన పోరాట యోధుడు సుభాస్ చంద్ర బోస్ అని నేతలు కొనియాడారు. ఈ కార్యక్ర మంలో తిరువూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు, నాయకులు ఏ.జీవన్ బాబు, బొడ్డు ప్రకాశరావు, గంజా కష్ణ మోహన్, జీడి మల్ల బాలు, గుడిమెట్ల మోహన్ రావు, యిజ్జాడ జగన్నాథం, గంధం శ్రీనివాస రావు, చావల రంగయ్య, యద్దనపూడి రాము లు, గరికపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** ఆజాద్ హిందూ ఫోజ్ వ్యవస్థాపకులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ యువనాయకులు సామినేని వెంకట కృష్ణప్రసాద్ మరియు ఇతర నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకరరావు, మాజీ కౌన్సిలర్ చారుగుండ్ల కొండా, జనసేన నాయకులు ఈమని కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పొక్కునూరు పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు

**ప్రజాశక్తి-నందిగామ:** పొక్కునూరు గ్రామంలో సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాల ఆవరణను పరిశీలించి, అక్కడి సౌకర్యాలు, పరిస్థితులను సమీక్షించారు. తనిఖీ సమయంలో సౌమ్య విద్యార్థులతో కరచలనం చేసి, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడారు. విద్యార్థుల నుండి వారి అభ్యసన ప్రగతి, పాఠశాలలో జరిగే కార్యక్రమాలు మరియు వారి అనుభవాల గురించి వివరాలు తెలుసుకున్నారు. అదే విధంగా, ఉపాధ్యాయులతో కూడా సమావేశమై, వారు బోధించే పాఠ్యాంశాలు, బోధనా విధానాలు మరియు విద్యార్థుల పట్ల వారి వైఖరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో పాఠశాలలోని విద్యా నాణ్యత మరియు సౌకర్యాలపై తంగిరాల సౌమ్య సంతప్తి వ్యక్తం చేశారు.. పొక్కునూరు గ్రామంలోని ఈ పాఠశాలలో ప్రస్తుతం రెండు ప్రాథమిక పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల , ఒక మాధ్యమిక పాఠశాల ఉన్నాయని, వీటి ద్వారా స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని ఆమె గమనించారు. ఈ తనిఖీ కార్యక్రమం విద్యార్థులు మరియు ఉపాధ్యాయులలో ఉత్సాహాన్ని నింపడంతో పాటు, విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపడుతున్న కషిని ప్రతిబింబిస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఎల్ఏ తంగిరాల సౌమ్య

# నిర్ణీత సమయంలోగా అర్జీలను పరిష్కరించాలి : కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

**ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)** : తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ మీకోసం కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలను నిర్ణీత సమయానికి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డీఆర్వో కే చంద్రశేఖరరావు, బందరు ఆర్డిఓ కే స్వాతితో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టి అర్జీదారులకు సకాలంలో నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ యూరియా కేవలం వ్యవసాయ రైతులకు మాత్రమేనని, పౌల్ట్రీ, ఆక్వా, పరిశ్రమలు తదితర వ్యవసాయేతర అవసరాలకు వినియోగించకూడదని హెచ్చరిస్తూ, దీని పర్యవేక్షణ కోసం వ్యవసాయ, మత్స్య, పశు సంవర్ధక, పరిశ్రమలు తదితర శాఖల అధికారులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ నిబంధనలకు విరుద్ధంగా యూరియాను వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే చట్టపర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**గీత కార్మికుల బార్‌లకు డ్రా తీసిన కలెక్టర్**

నూతన బార్ పాలసీ 2025-2028లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గీత కులాలకు కేటాయించిన నాలుగు మద్యం బార్ లను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారుల సమక్షంలో సోమవారం పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ డ్రా ద్వారా షాపులను కేటాయించారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఒకటి, గుడివాడ మున్సిపాలిటీకి ఒకటి, అదేవిధంగా తాడిగడప మున్సిపాలిటీ రెండు బార్‌లు కలిపి మొత్తం నాలుగు బార్‌లను గీత కులాలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ కార్యక్రమంలో కెఆర్ఆర్సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఇంచార్జ్ హౌసింగ్ పీడీ పోతురాజు, డిపిఓ జే అరుణ, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, ఆర్ అండ్ బి ఈఈ లోకేష్, సిపిఓ భీమరాజు, డ్వామా పీడీ ఎస్వీ శివ ప్రసాద్ యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్రావు పాల్గొన్నారు.

**సమస్య ఏదైనా పరిష్కరిస్తాం : ఎస్పి**

మీకోసం కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కారం చూపించాలని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు అధికారులకు సూచించారు. సోమవారం మీకోసం కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మీకోసం కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలకు ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి, బాధితులకు అండగా ఉండేందుకే ఈ మీకోసం కార్యక్రమం అన్నారు. సమస్య లను వాటిపై సమగ్ర విచారణ జరిపి అవసరం మేరకు కేసులు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయడానికి కృష్ణాజిల్లా పోలీస్ యంత్రాంగం సర్వదా సిద్ధంగా ఉందని ఆ దిశగా పోలీస్ అధికారులు కృషి చేయాలని సూచించారు.



అర్జీదారుల సమస్య వింటున్న ఎస్పి గంగాధరరావు

## 341 మందికి వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** "ఆరోగ్యమే మహాభాగ్యం" ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి కుటుంబం అంతా ఆనందంగా ఉండాలి. అనే ఉన్నత ఆశయంతో జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఆర్టీసీ కాలనీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ వద్ద ఉచిత మెగా సంచార వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 341 మంది వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 341 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ శిబిరంలో ఫౌండేషన్ పట్టణ కోఆర్డినేటర్ మైనేని రాధాకష్ణ, కట్టా వెంకట నరసింహారావు, కౌన్సిలర్లు పూచల పుల్లారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు యామర్తి బోస్ యాదవ్, దేవరకొండ హనుమంతరావు, కాసరగడ్డ వెంకటేశ్వరరావు, కొత్త నాగరాజు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



**ప్రజాశక్తి-నందిగామ** : నందిగామ పట్టణంలో జీవి మాల్ ప్రారంభమైంది. ఈ ప్రారంభానికి సినీ యాంకర్ అనసూయ వస్తుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఇక్కడికి భారీగా ప్రజలు చేరుకున్నారు. కానీ నిత్యం ప్రజలు, ద్విచక్ర వాహనాలు కార్లు, అంబులెన్స్ వెళ్లే రోడ్డు మార్గం కావడం, ఇక్కడికి సినీ యాంకర్ అనసూయ వస్తుందన్న నేపథ్యంలో ఈ జీవి మాల్ కి పక్కనే ఒక విద్యుత్ ట్రాన్సారం ప్రమాదకరంగా వుంది. భారీగా ప్రజలు పిల్లలు అనసూయ ను చూడటానికి వచ్చారు. ఇదే నేపద్యంలో కరెంటు ట్రాన్సారం కు ఎటువంటి రక్షణ కవచం లేదు. ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రజలు ప్రశ్నించారు. ఈ ట్రాన్సార్మ్ కు చుట్టూ రక్షణ కవచం నిర్మిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



**ప్రజాశక్తి-కంకిపాడు** : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కమిషనర్‌కు నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం పనిచేస్తున్న మునిసిపల్ కార్మికులు మరణిస్తే వారి కుటుంబసభ్యులను పనిలోకి తీసుకోవడంలేదని, కానీ ఈమధ్యకాలంలో దాదాపు 50 మంది బయట కార్మికులను తీసుకున్నారని అన్నారు. మున్సిపల్ వర్కర్స్ చనిపోయిన కుటుంబాల్లో నుంచి ఒకరిని పనిలోకి తీసుకోవాలని గత రెండు సంవత్సరాలుగా యూనియన్ ఆధ్వర్యంలో వర్కర్స్ పోరాటం చేస్తున్నా పట్టించుకోవడంలేదన్నారు. అలాగే 2023 డిసెంబర్లో నెలలో ఆగిపోయిన హెల్త్ అలవెన్స్ 6000 రూపాయలు వెంటనే ఇప్పించాలని, 2024 జనవరి నెలలో చేసిన సమ్మె తాలుకు 8 రోజుల సమ్మె కాలం జీతం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాశీం, సరళ, మధిర ఏడుకొండలు, వెంకటరెడ్డి మిగతా మున్సిపల్ వర్కర్స్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం)** : బాపులపాడు గ్రామంలో శ్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా సేవా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని సత్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను కాపాడాలని నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అభ్యసించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో 37 మంది విద్యార్థులకు 1,70,000 రూపాయలు ప్రోత్సాహక బహుమతులు, అబ్దుల్ కలాం జీవిత చరిత్ర పుస్తకం, ప్రశంసా పత్రాలు, అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులకు మెడల్స్ అందించారు. ఈ కార్యక్రమంలో డివి రమణ, మానవతా చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు, ప్రముఖ హ్యాంకాలోజిస్ట్ పోలవరపు కళ్యాణ్ చక్రధర్, ప్రముఖ కార్డియాలజిస్ట్ వీరమాచనేని స్వరాజ్యం, వీరమాచనేని శ్రీదేవి, ఎంఈఓ బాలాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

# పిఎసిఎస్ నూతన పాలకవర్గాల ప్రమాణస్వీకారం



ఉంగుటూరు మండలం వెల్దిపాడులో
చైర్మన్, సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దిపాడు పిఎసిఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం**

**ప్రజాశక్తి-ఉంగుటూరు** : రైతాంగ సంక్షేమం కోసం, సహకారం సంఘాల బలోపేతానికి పాలక వర్గం కృషి చేయాలని టిడిపి గన్నవరం నియోజకవర్గ నాయకులు కాసర్నేని రాజా అన్నారు. మండలంలోని వెల్దిపాడు పిఎసిఎస్ లో సోమవారం త్రిసభ్య పాలక వర్గ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. చైర్ పర్సన్‌గా నెక్కలపూడి వెంకట రాజమన్నార్, కమిటీ సభ్యులుగా కొట్నాని శ్రీనివాసరావు, పాతూరి శివ రంగారావు లను నియమిస్తూ కేడీసీసీ ఉంగుటూరు బ్రాంచ్ మేనేజర్ పఠాన్ షరీబ్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాసర్నేని రాజా మాట్లాడుతూ సహకార సంఘాల నిత్యం రైతులకు అందుబాటులో ఉంచి రైతాంగ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కొలుసు రవీంద్ర, గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నెక్కలపూడి వెంకట అప్పారావు, మాజీ డైరెక్ట్ బి కిరణ్, పోతినేని రామక్రిష్ణ, కాట్రగడ్డ సత్యప్రసాద్, కొట్నాని మోహన్‌రావు, మావులూరి వెంకయ్య పాల్గొన్నారు.

**నాగాయితిప్ప పిఎసిఎస్ చైర్మన్‌గా సీతారామ ప్రసాద్**

**ప్రజాశక్తి-మోపిదేవి** : మోపిదేవి మండలం నాగాయితిప్ప పిఎసిఎస్ చైర్పర్సన్‌గా బల్లా సీతారామ ప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. చైర్ పర్సన్ గా బఇలా సీతారామ ప్రసాద్, పర్సనల్గా రేపల్లె మునీశ్వరావు, గరికపాటి రాఘవయ్య లు కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. నూతన పాలకవర్గానికి టిడిపి అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయులు మండలి వెంకట్రామ్, పార్టీ నాయకులు బొబ్బ గోవర్ధన్ నాయకులు అభినందనలు తెలిపారు.

**ముక్కొల్లు పిఎసిఎస్ త్రీ మెన్ కమిటీ ప్రమాణ స్వీకారం**

**ప్రజాశక్తి-గూడూరు** : గూడూరు మండలం ముక్కొల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్ పర్సన్ గా సమ్మెట రాఘవ ప్రసాద్ (నాని) పర్సన్లుగా శాఖల మహంకాళ రావు ముక్కు సుబ్రహ్మణ్యేశ్వరరావులు సోమవారం ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు స్వీకరించారు. గూడూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డీసీ చైర్మన్ పోతన స్వామి నాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి నాగబాబు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఎన్ ఎ బేగ్, గూడూరు మాజీ సర్పంచ్ జనసేన పార్టీ నాయకులు పోతన రామోజీ పాల్గొన్నారు.

**ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి**

**ప్రజాశక్తి-చల్లపల్లి** : కూటమి ప్రభుత్వానికి మంచి వచ్చేలా రైతుల సంక్షేమానికి పాటుపడుతూ సొసైటీలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అవనిగడ్డ నియోజకవర్గ టిడిపి పరిశీలకులు కనకపర్తి శ్రీనివాసరావు, యువ నేత మండలి వెంకట్ రామ్ లు అన్నారు. మండల పరిధిలోని మేకవారిపాలెం పిఎస్‌సిఎస్‌చైర్ పర్సన్ గా గుత్తికొండ వంశీకష్ణ, పర్సన్లగా వక్కలగడ్డ శివరామకష్ణ, చిక్కినేని శ్రీనివాసరావులు సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా అభినందన సభ నిర్వహించి చైర్ పర్సన్, పర్సన్ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యురాలు గాజుల పార్టీ కళ్యాణి, పాగోలు, చల్లపల్లి సర్పంచులు తోట శ్రీనివాసరావు, పైడిపాముల కష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, తోట కనకదుర్గ, చల్లపల్లి మండల వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు పైడిపాముల స్వప్న, చల్లపల్లి పిఎసిఎస్ చైర్పర్సన్ బొందలపాటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అలాగే లక్ష్మీపురం పిఎస్ఎస్ చైర్పర్సన్ గా యార్రగడ్డ సోమశేఖర ప్రసాద్( లంక బాబు), పర్సన్లగా తోట రాజేశ్వరరావు, సూదాని పూర్ణ చంద్రరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో యువనేత మండలి వెంకట్రామ్, కనకపర్తి శ్రీనివాసరావు, మాజేరు పిఎసిఎస్ సీఈవో చక్రపాణి, సీఈఓ లంకపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


**బొమ్ములూరు, రామన్నపూడి పిఎసిఎస్ కమిటీ ప్రమాణస్వీకారం**

**ప్రజాశక్తి-గుడివాడ** : వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చి అన్నదాతకు అన్ని విధాలా కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం గుడివాడ రూరల్ మండలం బొమ్ములూరు గ్రామ పిఎసిఎస్. కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కమిటి చైర్మన్‌గా గుత్తా సుబ్రహ్మణ్యేశ్వరరావు, డైరెక్టర్లుగా అవ్వారు రాంపండు, మరిది నాగరాజు బాధ్యతలు చేపట్టారు.

అలాగే గుడివాడ రూరల్ మండలం రామన్న పూడి పిఎసిఎస్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం రాత్రి గ్రామంలో ఘనంగా జరిగింది. ముందుగా సొసైటీ చైర్మన్‌గా సూరపనేని రామకష్ణ (చిన్నబాబు), డైరెక్టర్లు తలారి రాజా రత్నం, మరదల కష్ణలు బాధ్యతలు చేపట్టారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ రైతాంగ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, కూటమి నాయకులు జగన్మోహన్రావు, బసవయ్య, కుటుంబరావు, గురుపత్తి సుబ్బారావు, రేమల్లి రజనీకాంత్, ఇంటూరి గజేంద్ర పాల్గొన్నారు.



చల్లపల్లి మండలంలో...



మోపిదేవి మండలంలో...



గుడివాడ మండలంలో...

## విద్యతోనే ఉన్నత భవిష్యత్తు



**ప్రజాశక్తి-మైలవరం:** విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు మణికుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం స్థానిక లీలావతి గిరిజన పాఠశాలలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు వస్తుందని, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు రాణిస్తున్నారు. ప్రభుత్వం అందించే సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడత లక్ష్మీనారాయణ, కార్యదర్శి రాధాకుమారి పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**ప్రజాశక్తి-రెడ్డిగూడెం:** మండల పరిధిలోని రంగాపురం గ్రామపంచాయతీ శివారు బూరుగగూడెం గ్రామంలో సూర్య హెల్పింగ్ హ్యాండ్స్ అధినేత ఆకుల సూర్యకిరణ్ ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రముఖ ఐపిఎస్ అధికారి టి.పనాసరెడ్డి ప్రారంభించారు. మొత్తం 482 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 50 మందికి శుక్లాల ఆపరేషన్‌కి రిఫర్ చేశారు. 350 మందికి కళ్లజోళ్లు అవసరం అని వాటిని కూడా తాను ఉచితంగానే అందిస్తానని సూర్యకిరణ్ తెలిపారు. నూజివీడు అమెరికన్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ కంటి వైద్య నిపుణులు దత్తు పాల్గొని వైద్య సేవలు అందించారు.

## విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



**ప్రజాశక్తి-వత్సవాయి:** పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకట దుర్గ ఐక్య శ్రీ పాప పుట్టిన రోజు సందర్భంగా ప్లేట్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శెట్టిపోగు రాము, బియ్యాల రామారావు, ఇంజనీర్ కత్తిక గోపికృష్ణ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణంపై చర్యలు కోరుతూ వినతి



**ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ జివి మాల్ బిల్డింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్పందనలో సోమవారం నందిగామ ఆర్డిఓ బాలకృష్ణకు పలువురు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డు యాదవ బావి వెనుక అక్రమ నిర్మాణం చేపట్టిన బిల్డింగ్‌లో జీవి మాల్ ఏర్పాటు చేశారు. ఆ బిల్డింగ్ కి పర్మిషన్ లేకపోవడం వల్ల గతంలో మునిసిపల్ టౌన్ ప్లాన్ అధికారులు రెండుసార్లు స్లాబులు పడగొట్టారు. అక్రమ బిల్డింగ్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు వినతిపత్రం అందజేశారు.

## వైర్లు, కేబుల్ విభాగంలోకి సూర్య రోష్ని

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్:** లైటింగ్, ఫ్యాన్లు, గృహోపకరణాలు, స్టీల్, పీవీసీ పైపుల్లో అత్యంత విశ్వసనీయ పేర్లలో ఒకటైన సూర్య రోష్ని, దాని కొత్త టర్బో ఫ్లెక్స్ శ్రేణిని ప్రారంభించడంతో వైర్లు, కేబుల్స్ విభాగంలోకి ప్రవేశించిందని సంస్థ ఇంచార్జి ఆర్.కుమార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు తెలిపారు. రెండు వేరియంట్లలో కొత్తగా ప్రవేశపెట్టబడిన వైర్లు పర్యావరణ అనుకూలత, ఉన్నతమైన భద్రతా లక్షణాలతో నిర్మించబడ్డాయని అన్నారు. నలుపు, ఎరుపు, నీలం, ఆకుపచ్చ, బూడిద, తెలుపు, పసుపు అనే ఏడు ప్రకాశవంతమైన రంగులలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ వైర్లు నివాస, పారిశ్రామిక వైరింగ్ సెటప్‌లలో క్రియాత్మక భద్రత, సౌందర్య అమరిక పెరుగుతున్న డిమాండ్‌ను తీరుస్తాయని తెలిపారు.



కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా పురస్కారాలు అందుకుంటున్న అధికారులు



# అధికారుల పనితీరు భేష్

## పురస్కారాల ప్రదానంలో కలెక్టర్ లక్ష్మీశ



పురస్కారం అందుకుంటున్న కమిషనర్ ధ్యానచంద్ర

**ప్రజాశక్తి-విజయవాడ:** జిల్లా అధికారుల సమిష్టి కృషితోనే ఎన్నో మెగా ఈవెంట్లను విజయవంతంగా నిర్వహించగలిగామని.. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో ఉత్తమ ఫలితాల సాధనకు సమర్థవంతమైన అధికారులు, సిబ్బంది పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డిసిపి అడ్మిన్ సరితతో కలిసి విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన 376 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ముమ్మందు ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావడంలో భాగస్వాములు కావాలంటూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విజయవాడ నగరంలో గత ఏడాది కాలంలో ఎన్నో భారీ కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని.. ఒకవైపు ఆయా శాఖల కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తూనే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అహర్నిశలు కృషిచేశారని పేర్కొన్నారు. కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌ఎం, విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, నందిగామ ఆర్‌డీవో కె.బాలకృష్ణ, తిరువూరు ఆర్‌డీవో కె.మాధురికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం శాఖల వారీగా అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమం సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి అవార్డులు పొందిన జిల్లా అధికారుల్లో. డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, జిల్లా పశు సంవర్ధక అధికారి డా. ఎం.హనుమంతరావు, జెడ్‌పీ సీఈవో కె.కన్నమనాయుడు, సీపీవో వై.శ్రీలత, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, డ్వామా పీడీ ఎ.రాము, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం కె.ప్రియాంక, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు.శ్రీనివాసరావు, డీటీసీ ఎ.మోహన్, ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ టి.శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.బాబ్జి, జిల్లా జైలు సూపరింటెండెంట్ మొహమ్మద్ ఇర్ఫాన్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం, జిల్లా ఉపాధి కల్పన అధికారి సీ.మధుభూషణరావు, జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ ఎన్.షణ్ముగం, జిల్లా మత్స్య అధికారి సీఎస్ చక్రాణి, డీఎఫ్‌వో జి.సతీష్, గ్రౌండ్ వాటర్ డీడీ ఎం.నాగమల్లేశ్వరరావు, హౌసింగ్ అధికారి ఎం.రజనీకుమారి, ఇరిగేషన్ ఎస్ఈ ఆర్.మోహనరావు, మెప్మా పీడీ పి.సాయిబాబు, జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఎ.శ్రీనివాస్‌కుమార్, జిల్లా మైనారిటీ అధికారి అబ్దుల్ రబ్బానీ, మైనారిటీస్ కార్పొరేషన్ ఈడీ ఫర్జానా బేగం, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మహేశ్వరరావు తదితరులు అవార్డులు పొందారు.

## ఆటో కార్మికుల ఆందోళన

**ప్రజాశక్తి-విస్సన్నపేట:** రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో రంగం కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో విస్సన్నపేట తాసిల్దార్ కార్యాలయం ముందు ఆటో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించారని కానీ ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, సంవత్సరానికి ఆటో కార్మికులకు జీవన భృతి కింద 30 వేల రూపాయలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. ఆటో రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసిల్దార్ కే.లక్ష్మీ కళ్యాణికి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆటో కార్మికులు

వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్ యూనియన్ నాయకులు గోనెల మురళి, మధు, ఆదాం, ఏసుపాదం, షాకీర్, కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞానరత్నం, అప్పారావు, రాము, బాష తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

**ప్రజాశక్తి-మైలవరం**

సిఎం సహాయ నిధితో పేదలకు ఆర్థిక చేయూత లభిస్తుందని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మండలంలోని 44 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ప్రభుత్వం ఉంచి వచ్చిన సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కొండ ప్రాంత వాసులు

## కొండ ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్ నిర్మించాలి : సత్యబాబు

**ప్రజాశక్తి-విజయవాడ సిటీ:** విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో రిటైనింగ్ వాల్ నిర్మాణాలు చేపట్టి కొండ ప్రాంత వాసుల ప్రాణాలు కాపాడాలని సిపిఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు కోరారు. పశ్చిమ నగరంలో రిటైనింగ్ వాల్ నిర్మాణాలతో పాటు వరద ముంపు నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ కేఎల్ రావు నగర్ సర్కిల్ వన్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా వికలాంగుల పెన్షన్ రద్దు ఆపాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తూ ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ సెల్‌లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ పశ్చిమ నగరంలో సగభాగం కొండప్రాంతాల్లో జీవిస్తున్న ప్రజలకు ప్రమాదకరంగా మారిన కొండ రాళ్ల వర్షాకాలంలో జారిపడి ప్రాణాలు కోల్పోతున్నా పాలకులు పట్టించుకోవడంలేదని తెలిపారు. కొండ ప్రాంతాల రిటైనింగ్ వాల్ నిర్మాణాల అభివృద్ధి కోసం నగరానికి రావలసిన గ్రాంట్లు రూ.100 కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్ట్రామ్ వాటర్ కాలువల నిర్మాణాలకు విడుదల చేయాల్సిన రూ.289 కోట్లు బకాయిలు ఇవ్వాలన్నారు. పరిశుభ్రమైన మంచినీరు అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండ ప్రాంతాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కె.సూరిబాబు, పశ్చిమ అభివృద్ధి కమిటీ నాయకులు ఎన్.చిన్నగురప్ప సీతయ్య,పెన్షనర్స్ సంఘం నాయకులు జి దుర్గారావు, మహిళా నాయకులు నాగజ్యోతి, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.